'రాజ్య సంస్కరణ' ఈ-పేపర్ కోసం ఇక్కడ స్కాన్ చేయండి..

రాజ్య సంస్కరణ

TGBIL/26/A6717 RAJYA SAMSKARANA తెలుగు దినపత్రిక

www.rajyasamskarana.com

'రాజ్య సంస్కరణ' ఈ-పేపర్ కోసం ఇక్కడ స్కాన్ చేయండి..

మేడ్చల్ మల్కాజిగిరి | సంపుటి : 1 | సంచిక : 78 | సోమవారం | 2.11.2026 | పేజీలు : 8 | వెల రూ. 2

Medchal Malkajgiri | Volume: 1 | Issue: 78 | Monday | 2.11.2026 | Pages: 8 | Rate: 2



జ్ఞానేశ్ కుమార్ జైలుకే

చట్టం ముందు మోదీషా

తప్పించుకోలేరన్న రాహుల్

ఓటు హక్కు దొంగలను ఊరుకోం!

ఢిల్లీలోని రాంలీలా మైదానం వేదికగా ఇండియా కూటమి నిర్వహించిన 'ప్రజాస్వామ్య పరిరక్షణ' భారీ ర్యాలీలో లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ సంచలన వ్యాఖ్యలు చేశారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌పై తీవ్ర ఆరోపణలు గుప్పిస్తూ.. ప్రజల ఓటు హక్కును దొంగిలించినందుకు ఆయనను పదవి నుంచి తొలగించడమే కాకుండా జైలుకు పంపిస్తామని హెచ్చరించారు. (వివరాలు 4లో..)



బీజేపీకి యూపీలోనే రాజకీయ సమాధి

అధికారంలోకి తెచ్చిన ప్రజలే సాగనంపుతారు!

మార్పునకు సంకేతంగా జనసందోహం!

ప్రజాస్వామ్యానికి హల్దీఘాటీగా రాంలీలా మైదాన్!

సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్ ఫైర్



బెంగాల్‌ను బలిచేసిన ఎస్ఐఆర్

బీజేపీపై కలిసికట్టుగా పోరాటం!

సీజేపీ, జెన్‌జీకి మమతా అభినందనలు!

ఢిల్లీలోని రాంలీలా మైదానంలో ఇండియా కూటమి నిర్వహించిన ప్రజాస్వామ్య పరిరక్షణ ర్యాలీలో తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి మమతా బెనర్జీ బీజేపీపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ (ఎస్ఐఆర్)ను రాజకీయ ఆయుధంగా ఉపయోగిస్తూ ప్రతిపక్ష పాలిత రాష్ట్రాలను లక్ష్యంగా చేసుకుంటున్నారని ఆరోపించారు. (వివరాలు 4లో..)

నినాదాలు ఆపండి.. లేదంటే గంటసేపు!

ఖర్గే వార్నింగ్‌తో రాంలీలా మైదానంలో నవ్వులు

ఢిల్లీలోని రాంలీలా మైదానంలో ఇండియా కూటమి నిర్వహించిన భారీ ర్యాలీలో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే తనదైన శైలిలో కార్యకర్తలకు చురకలంటించారు. ప్రసంగించేందుకు వేదికపైకి వచ్చిన ఆయన దాదాపు 30 సెకన్ల పాటు మౌనంగా నిలబడ్డారు. (4లో..)



రాంలీలా ర్యాలీ అట్టర్ ఫ్లాప్.. బీజేపీ సెటైర్లు!

జనం లేని మైదానం.. రాహుల్‌పై విమర్శలు

ఢిల్లీలోని రాంలీలా మైదానంలో ఇండియా కూటమి నిర్వహించిన 'చలో ఢిల్లీ' ర్యాలీపై బీజేపీ తీవ్ర విమర్శలు గుప్పించింది. ప్రతిపక్షాల సభ అట్టర్ ఫ్లాప్ అయిందని, రాహుల్ గాంధీ ప్రసంగిస్తున్న సమయంలోనే జనం మైదానం నుంచి వెళ్లిపోయారని ఆరోపించింది. (వివరాలు 4లో..)





ఓట్ చోరీపై దద్దరిల్లిన ఢిల్లీ!

- **కేంద్రంపై ఇండియా కూటమి పోరు..**
- **రామలీలా మైదానంలో ప్రతిపక్షాల గర్జన!**
- **జనసంద్రంగా మైదానం!**

ఢిల్లీలోని రామలీలా మైదానం ఆదివారం ప్రతిపక్షాల నిరసనతో హోరెత్తింది. 'ఓట్ బచావో.. దేశ్ బచావో' నినాదంతో ఇండియా కూటమి నిర్వహించిన భారీ సభకు కాంగ్రెస్, ఇతర ప్రతిపక్ష పార్టీల నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవడం కోసం ఇది కేవలం ర్యాలీ మాత్రమే కాదని, దేశవ్యాప్త ఉద్యమానికి నాంది అని కాంగ్రెస్ అభివర్ణించింది. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే నివాసం నుంచి సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, అఖిలేశ్ యాదవ్, మమతా బెనర్జీ తదితర నేతలు ప్రత్యేక బస్సులో ర్యాలీ ప్రాంగణానికి చేరుకున్నారు. ఓటర్ల జాబితాలో అక్రమాలు జరుగుతున్నాయనే ఆరోపణలపై కేంద్ర ఎన్నికల సంఘాన్ని నిలదీయడమే ఈ సభ ప్రధాన ఉద్దేశం. రికార్డు స్థాయిలో ప్రజలు పాల్గొన్నారని కాంగ్రెస్ నేతలు ప్రకటించారు. ఓటు చోరీకి వ్యతిరేకంగా ప్రజలు ఏకమయ్యారని, ప్రజాస్వామ్య పరిరక్షణకు తమ పోరాటం కొనసాగుతుందని పార్టీ పేర్కొంది.

మోదీ రావణుడైతే.. కాంగ్రెస్ వానరసేన!

ఓటు చోరీపై రేవంత్ రెడ్డి నిప్పులు..



ప్రధాని నరేంద్ర మోదీని రావణుడితో పోలుస్తూ తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు రాజకీయంగా చర్చనీయాంశమయ్యాయి. కాంగ్రెస్ పార్టీ శ్రేణులను వానరసేనగా అభివర్ణిస్తూ ఆయన ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. న్యూఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలను ఉద్దేశించి రేవంత్ రెడ్డి మాట్లాడారు. దేశంలో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ పేరుతో జరుగుతున్న అక్రమాలను వ్యతిరేకిస్తూ ఇండియా కూటమి నిర్వహిస్తున్న నిరసన కార్యక్రమంలో పాల్గొనేందుకు తెలంగాణ నుంచి భారీ సంఖ్యలో కార్యకర్తలు ఢిల్లీకి చేరుకున్నారని తెలిపారు. రామలీలా మైదానంలో జరిగే సభలో ఓట్ల తొలగింపుపై కాంగ్రెస్ తన పోరాటాన్ని కొనసాగిస్తుందని ప్రకటించారు. (వివరాలు 2లో..)



హైదరాబాద్‌కు ట్రాఫిక్ శాపం!

విషవాయువుల మధ్య బతుకులు!

- వాహనాల వరద.. మెట్రోకు బ్రేకులు
- వాహనం లేకపోతే ప్రయాణం కష్టమే..!
- కాలుష్యంతో భాగ్యనగరం ఉక్కిరిబిక్కిరి
- ప్రజా రవాణా కరువు.. ప్రైవేటు వాహనాలే దిక్కు!

వివరాలు 7లో..

ఒకప్పుడు ముత్యాల నగరం.. ఇప్పుడు వాహనాల సముద్రం! రోడ్డు మీద అడుగు పెడితే ట్రాఫిక్ కష్టాలు.. వాహనం స్టార్ట్ చేస్తే కాలుష్య కష్టాలు.. ప్రజా రవాణాను ఆశ్రయిస్తే సమయానికి గమ్యం చేరుతామన్న నమ్మకం లేదు! సొంత బైక్, కారు లేకుండా హైదరాబాద్‌లో బతకడం కష్టమైపోతోందా? ప్రపంచంలోని సంపన్న నగరాల కంటే హైదరాబాద్‌లోనే వ్యక్తిగత వాహనాల వినియోగం ఎక్కువగా ఉందన్న అంచనాల వెనుక అసలు కథ ఏమిటి? సింగపూర్, లండన్, న్యూయార్క్, షాంఘై నగరాలు ప్రజా రవాణాతో ప్రయాణ భారాన్ని తగ్గించుకుంటుంటే.. భాగ్యనగరం మాత్రం వాహనాల రద్దీలో ఎందుకు చిక్కుకుపోతోంది? దేశవ్యాప్తంగా మెట్రో రైళ్లు విస్తరిస్తుంటే హైదరాబాద్‌లో 69 కిలోమీటర్లకే ఎందుకు పరిమితమైంది? కేసీఆర్ పదేళ్ల పాలనలో ఏం జరిగింది? రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఇప్పుడేం చేస్తోంది? కేంద్రం అనుమతులు ఎప్పుడు వస్తాయి? వేల కోట్ల ప్రాజెక్టుల ప్రకటనలు, కాంట్రాక్టుల మధ్య సామాన్యుడికి దక్కుతున్న ప్రయోజనం ఎంత? ఒకవైపు గంటల తరబడి ట్రాఫిక్.. మరోవైపు ఊపిరితిత్తుల్లోకి చేరుతున్న కాలుష్యం! చివరకు హైదరాబాద్ అభివృద్ధికి వాహనాలే అడ్డంకిగా మారాయా? హైదరాబాదీలకు ఈ ప్రయాణ శాపం నుంచి విముక్తి ఎప్పుడు? అసలు తప్పెక్కడుంది.. బాధ్యులెవరు.. పరిష్కారం ఏమిటి?



వివరాలు5లో..

ఏసీబీ వలలో అధికారులు

అవినీతికి అడ్డుకట్ట ఎక్కడ?

- **ఏసీబీ దాడులు, ఆ తర్వాత కేసుల మూసివేత**
- **ఏసీబీ దాడులు చేస్తోంది.. శిక్షలు పడుతున్నాయా?**
- **ప్రభుత్వ అనుమతుల దగ్గరే న్యాయానికి అడ్డంకులా?**
- **అధికారులకు ఒక నిబంధన.. సామాన్యులకు మరో న్యాయమా?**

లంచం తీసుకుంటూ పట్టుబడ్డారు.. అక్రమాస్తుల గుట్టు బయటపడింది.. ఏసీబీ సోదాల్లో కోట్ల రూపాయల ఆస్తులు వెలుగుచూశాయి.. ఇక కఠిన చర్యలు తప్పవని ప్రజలు భావించారు. కానీ తెరవెనుక కథ మరోలా సాగుతోంది! దర్యాప్తు పూర్తయింది.. ప్రాసిక్యూషన్‌కు ఏసీబీ సిఫారసు చేసింది.. ప్రభుత్వ అనుమతి మాత్రం రాలేదు! ఫలితం.. ఒక్కటొక్కటిగా కేసులు మూసివేతకు చేరుతున్నాయి. తెలంగాణలో 2023 నుంచి కనీసం 20 ఏసీబీ కేసులు ప్రభుత్వ అనుమతి నిరాకరణతో ముగింపు దశకు వెళ్లినట్లు వెలుగులోకి వచ్చిన వివరాలు ఇప్పుడు సంచలనం రేపుతున్నాయి. లంచం తీసుకుంటూ పట్టుబడిన ఐదు ట్రాప్ కేసులకూ ఇదే పరిస్థితి ఎదురైనట్లు సమాచారం. కోట్ల ఆస్తుల కేసుల్లోనూ శాఖాపరమైన విచారణలే ప్రత్యామ్నాయంగా మారుతున్నాయా? ఏళ్ల తరబడి సాగుతున్న దర్యాప్తులు, అనుమతుల జాప్యాలు, విచారణల్లో అలసత్వం.. ఇవన్నీ అవినీతి నిరోధక వ్యవస్థను ప్రశ్నార్థకం చేస్తున్నాయి. ఉద్యోగుల ఆస్తుల వివరాల వెల్లడిపై నిబంధనలు ఉన్నా అమలు ఎంతవరకు? తప్పు చేసినవారికి శిక్ష పడకపోతే భయం ఎలా పుడుతుంది? ఏసీబీ పట్టుకుంటే కేసు నడుస్తుందా.. లేక ప్రభుత్వ ఉత్తర్వులతో తెరపడుతుందా? అసలు ఈ వ్యవస్థలో లొసుగులు ఎక్కడ? బాధ్యులెవరు? ప్రజాధనాన్ని కాపాడాల్సిన పాలనా యంత్రాంగమే సమాధానం చెప్పాల్సిన ప్రశ్నలివి. అవినీతిపై దాడులు సరిపోవు.. దోషులకు శిక్ష పడాలి!



మాక్ ప్రధానిగా సంతృప్తి చెందాల్సిందే

రాహుల్ ర్యాలీపై అమిత్ షా సెటైర్లు

నేడు హైదరాబాద్‌కు హోం మంత్రి

కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. 1984 సిక్కు వ్యతిరేక అల్లర్ల బాధితుల సంస్మరణ రోజున ఢిల్లీలో ఇండియా కూటమి నిర్వహించిన ర్యాలీ వారి గాయాలను మళ్లీ రేపినట్లేనని వ్యాఖ్యానించారు. (వివరాలు 2లో..)



తాగునీటిని వృథా చేస్తే కుదరదు!

ఇతర అవసరాలకు శుద్ధి చేసిన నీరే

నీటి పాడుపుపై సీఎం హెచ్చరిక

జలమండలి సేవలకు 37 ఏళ్లు

హైదరాబాద్ ప్రజలకు నిరంతర తాగునీటి సరఫరా, మురుగునీటి నిర్వహణలో హైదరాబాద్ మెట్రోపాలిటన్ వాటర్ సప్లై అండ్ సీవరేజ్ బోర్డు అందిస్తున్న సేవలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభినందించారు. (వివరాలు 2లో..)

మురాసు తుపాను ముప్పు

నేడు, రేపు భారీ వర్షాలు!



ఫోన్ ట్యాపింగ్ కేసు

హరీశ్‌రావుపై అదనపు సెక్షన్లు!

సిద్దిపేటకు చేరిన కేసు దర్యాప్తు

తెలంగాణలో సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో మాజీ మంత్రి, బీఆర్ఎస్ఎమ్మెల్యే హరీశ్‌రావుకు సంబంధించిన కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. హైదరాబాద్‌లోని పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌లో నమోదైన కేసు సిద్దిపేట వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌కు బదిలీ అయింది. (వివరాలు 2లో..)

ఇది ప్రకృతి కరువు కాదు

- **కాంగ్రెస్ సృష్టించిన విలయం!**
- **ఎకరానికి రూ.60 వేల పరిహారం చెల్లించాలి**
- **రైతు గర్జనతో ప్రభుత్వానికి కేటీఆర్ సవాల్!**

ఆదిలాబాద్‌లో నిర్వహించిన రైతు గర్జన సభ వేదికగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కాంగ్రెస్ ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు. తెలంగాణలో ఏర్పడింది ప్రకృతి తెచ్చిన కరువు కాదని, కాంగ్రెస్ పాలనలో తీసుకున్న తప్పుడు నిర్ణయాల ఫలితమని తీవ్రంగా విమర్శించారు. (2లో..)



రైతుల కన్నీళ్లకు రేవంత్ సమాధానం చెప్పాలి!

108 మంది అన్నదాతల ఆత్మహత్యలు : కేటీఆర్

భారత్‌లో తొలి బుల్లెట్ రైలు సిద్ధం!

గంటకు 280 కి.మీ వేగం



- **స్వదేశీ సాంకేతికతతో హైస్పీడ్ ప్రయాణం!**
- **ఎనిమిది కోచ్‌లు.. 557 మంది ప్రయాణికులు**
- **బెంగళూరులో తయారీ.. దేశంలో కొత్త చరిత్ర!**

భారత రైల్వే చరిత్రలో మరో కీలక అధ్యాయం ప్రారంభం కానుంది. దేశంలోనే తొలిసారిగా స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందిస్తున్న బుల్లెట్ రైలు తయారీపనులు బెంగళూరులోని భారత్ ఎర్త్ మూవర్స్ లిమిటెడ్ (బీఈఎంఎల్) కేంద్రంలో కొనసాగుతున్నాయి. (వివరాలు 2లో..)



ఇది ప్రకృతి కరువు కాదు
కాంగ్రెస్ సృష్టించిన కరువు!

- ఎకరానికి రూ.60 వేల పరిహారం చెల్లించాలి
- రైతు గర్జనతో ప్రభుత్వానికి కేటీఆర్ సవాల్!

ఆదిలాబాద్‌లో నిర్వహించిన రైతు గర్జన సభ వేదికగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కాంగ్రెస్ ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు. తెలంగాణలో ఏర్పడింది ప్రకృతి తెచ్చిన కరువు కాదని, కాంగ్రెస్ పాలనలో తీసుకున్న తప్పుడు నిర్ణయాల ఫలితమని తీవ్రంగా విమర్శించారు. రైతులను ఆదుకోవాల్సిన ప్రభుత్వం చేతులెత్తేసిందని, పంటలు వేయొద్దని చెప్పే దుస్థితికి రాష్ట్రాన్ని తీసుకొచ్చిందని మండిపడ్డారు. రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కాలయాపన చేస్తున్నారని ఆరోపించారు. ఎకరానికి రూ.15 వేల రైతుబంధు ఇస్తామని చెప్పిన హామీ ఏమైందని ప్రశ్నించారు. ఇప్పటికే ఎగ్గొట్టిన మూడు విడతల రైతుబంధు, ప్రస్తుత యాసంగి పెట్టుబడి సాయం కలిపి ఎకరానికి రూ.60 వేల చొప్పున వెంటనే రైతుల ఖాతాల్లో జమ చేయాలని డిమాండ్ చేశారు. రూ.2 లక్షల రుణమాఫీ, కౌలు రైతులకు ఆర్థిక సాయం, రైతు కూలీలకు భరోసా వంటి హామీలను కూడా ప్రభుత్వం విస్మరించిందని విమర్శించారు. రైతుల ఓట్లతో అధికారంలోకి వచ్చి ఇప్పుడు వారినే పట్టించుకోకపోవడం కాంగ్రెస్ పాలనలోని వైఫల్యమని ధ్వజమెత్తారు.

నీళ్లు ఉన్నా పంటలకు అందించలేరా?

తెలంగాణలో వర్షపాతం లోటు కంటే రెండింతలు అధికంగా ఉన్న ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల్లో కరువు పరిస్థితులు లేకపోతే ఇక్కడే ఎందుకు వచ్చిందని కేటీఆర్ ప్రశ్నించారు. కన్నెపల్లి పంప్‌హౌస్ వద్ద లక్ష క్యూసెక్కుల నీళ్లు దిగువకు వెళ్తున్నా వాటిని ఎత్తిపోయలేని అసమర్థత ఎవరిదని రేవంత్‌రెడ్డిని నిలదీశారు. గోదావరిలో 750 టీఎంసీల నీరు అందుబాటులో ఉన్నా రైతులకు సాగునీరు అందించలేకపోతున్నారని ఆరోపించారు. కాళేశ్వరం, పాలమూరు ప్రాజెక్టులను సమర్థంగా వినియోగిస్తే ఒక్క ఎకరం కూడా ఎండిపోయేది కాదని స్పష్టం చేశారు. ఎల్‌నినో ప్రభావం వస్తుందని, నీటిని ముందుగానే ఎత్తిపోయాలని హెచ్చరించిన ఇంజినీర్లకు బెల్ట్ ట్రీట్ మెంట్ ఇవ్వాలన్న రేవంత్ వ్యాఖ్యలపై కేటీఆర్ ఘాటుగా స్పందించారు. హెచ్చరించిన అధికారులకు కాదు.. నీటిని ఎత్తిపోకుండా రైతులకు కరువు తెచ్చిన ముఖ్యమంత్రికే ఆ చికిత్స అవసరమని ఎద్దేవా చేశారు. రైతులకు డబ్బులివ్వడానికి నిధుల్లేవని చెప్పే ప్రభుత్వానికి ఢిల్లీకి నిధులు పంపేందుకు మాత్రం కొరత లేదని విమర్శించారు. రేవంత్‌రెడ్డిగారూ.. రైతులను ఆదుకోండి, ఇచ్చిన హామీలన్నీ అమలు చేయండి. కరువు బాధ్యత నుంచి తప్పించుకోవద్దు అంటూ కేటీఆర్ సూటిగా సవాల్ విసిరారు.

మాక్ ప్రధానిగా సంతృప్తి చెందాల్సిందే

రాహుల్ ర్యాలీపై అమిత్ షా సెటైర్లు
నేడు హైదరాబాద్‌కు హోం మంత్రి



అప్పటి ప్రధాని రాజీవ్ గాంధీ చేసిన 'పెద్ద చెట్టు కూలితే భూమి కంపిస్తుంది' అనే వ్యాఖ్యను కూడా ప్రస్తావించారు. ఇలాంటి చీకటి రోజున రాహుల్ గాంధీ ర్యాలీ నిర్వహించడం బాధితుల పట్ల సున్నితత్వం లేని చర్యగా అభివర్ణించారు.

కాంగ్రెస్‌పై విమర్శలు.. మోదీ సర్కారుకు కితాబు!

1984 అల్లర్లకు సంబంధించి 2014లో నరేంద్ర మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పాత కేసులను తిరిగి విచారించిందని అమిత్ షా పేర్కొన్నారు. బాధిత కుటుంబాలకు రూ.5 లక్షల పరిహారం అందించడంతో పాటు, అల్లర్లలో పాత్ర ఉందని ఆరోపణలు ఎదుర్కొన్న కాంగ్రెస్ నేతలపై చర్యలు తీసుకున్నామని చెప్పారు. రాహుల్ గాంధీ జీవితాంతం మాక్ పార్లమెంటులోనే ఉండాల్సి వస్తుందని, ప్రధాని కావాలనే ఆయన ఆశ నెరవేరదని ఎద్దేవా చేశారు. అబద్ధాలు ప్రచారం చేయడం, పార్లమెంట్ కార్యకలాపాలకు ఆటంకం కలిగించడం ప్రతిపక్షానికి అలవాటుగా మారిందని విమర్శించారు. మరోవైపు, ఓట్ల చోరీ ఆరోపణలపై ప్రధానమంత్రి మోదీ, అమిత్ షా చట్టపరమైన చర్యలను ఎదుర్కోవాల్సి వస్తుందని రాహుల్ గాంధీ ఢిల్లీ సభలో హెచ్చరించారు. ఈ నేపథ్యంలో అధికార, ప్రతిపక్షాల మధ్య రాజకీయ మాటల యుద్ధం మరింత వేడెక్కింది.

నేడు హైదరాబాద్‌లో అమిత్ షా పాదయాత్ర!

ఢిల్లీ రాజకీయ విమర్శల వేడి కొనసాగుతుండగానే అమిత్ షా సోమవారం హైదరాబాద్‌లో పాదయాత్ర చేపట్టనున్నారు. తెలంగాణలో సర్ ప్రక్రియపై కాంగ్రెస్ తప్పుదు ప్రచారం చేస్తోందని ఆరోపిస్తూ బీజేపీ నిర్వహిస్తున్న కార్యక్రమంలో ఆయన పాల్గొంటారు. మధ్యాహ్నం బషీర్‌బాగ్‌లోని బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహం నుంచి మొజంజాహీ మార్కెట్ వరకు పాదయాత్ర సాగనుంది. అనంతరం అక్కడ ప్రజలను ఉద్దేశించి అమిత్ షా ప్రసంగిస్తారు. కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి, తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు ఇప్పటికే పాదయాత్ర మార్గాన్ని పరిశీలించి భద్రత, ఇతర ఏర్పాట్లను సమీక్షించారు. న్యాయవాదులు, వైద్యులు, మేధావులు, వేలాది మంది బీజేపీ కార్యకర్తలు ఈ కార్యక్రమంలో పాల్గొంటారని పార్టీ నేతలు వెల్లడించారు. ఢిల్లీలో ఇండియా కూటమి చేసిన విమర్శలకు హైదరాబాద్ వేదికగా అమిత్ షా సమాధానం ఇచ్చే అవకాశం ఉండటంతో ఈ పర్యటనపై రాజకీయ వర్గాల్లో ఆసక్తి నెలకొంది.

మోదీ రావణుడైతే.. కాంగ్రెస్ వానరసేన!

ఓటు చోరీపై రేవంత్ రెడ్డి నిప్పులు..



ప్రధాని నరేంద్ర మోదీని రావణుడితో పోలుస్తూ తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు రాజకీయంగా చర్చనీయాంశమయ్యాయి. కాంగ్రెస్ పార్టీ శ్రేణులను వానరసేనగా అభివర్ణిస్తూ ఆయన ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. న్యూఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలను ఉద్దేశించి రేవంత్ రెడ్డి మాట్లాడారు. దేశంలో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ పేరుతో జరుగుతున్న అక్రమాలను వ్యతిరేకిస్తూ ఇండియా కూటమి నిర్వహిస్తున్న నిరసన కార్యక్రమంలో పాల్గొనేందుకు తెలంగాణ నుంచి భారీ సంఖ్యలో కార్యకర్తలు ఢిల్లీకి చేరుకున్నారని తెలిపారు. రామలీలా మైదానంలో జరిగే సభలో ఓట్ల తొలగింపుపై కాంగ్రెస్ తన పోరాటాన్ని కొనసాగిస్తుందని ప్రకటించారు.

13.5 కోట్ల ఓట్లు తొలగించారంటూ ఆరోపణలు!

దేశవ్యాప్తంగా ఇప్పటికే 13.5 కోట్ల ఓట్లను తొలగించారని, రానున్న రోజుల్లో మరో ఏడు కోట్ల ఓట్లను తొలగించే ప్రమాదం ఉందని రేవంత్ రెడ్డి ఆరోపించారు. ముఖ్యంగా పేద ప్రజలను లక్ష్యంగా చేసుకుని వారి ఓటు హక్కును దూరం చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయని విమర్శించారు. ప్రధాని మోదీ తిరిగి అధికారంలోకి రావాలనే లక్ష్యంతో బీజేపీ ఈ కుట్రలకు పాల్పడుతోందని ఆరోపించారు. ఓటు హక్కును కాపాడుకోవడం ప్రజాస్వామ్య పరిరక్షణలో కీలకమని స్పష్టం చేశారు. ఈ అంశంపై దేశవ్యాప్తంగా కాంగ్రెస్ శ్రేణులు ఉద్యమించాలని పిలుపునిచ్చారు.

రైళ్లు ఆగినా.. ఢిల్లీకి కార్యకర్తల పరుగులు!

ఢిల్లీ నిరసన కార్యక్రమానికి తెలంగాణ నుంచి కార్యకర్తలు రావడానికి ఎదురైన ఇబ్బందులను రేవంత్ రెడ్డి ప్రస్తావించారు. రైళ్ల రాకపోకల్లో ఆటంకాలు ఎదురైనా పెద్ద సంఖ్యలో పార్టీ నాయకులు, కార్యకర్తలు దేశ రాజధానికి చేరుకున్నారని అభినందించారు. తెలంగాణ భవన్‌కు చేరుకున్న ముఖ్యమంత్రికి మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, పార్టీ నేతలు ఘన స్వాగతం పలికారు. అనంతరం రేవంత్ రెడ్డితో పాటు మంత్రులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ కార్యకర్తలు రామలీలా మైదానం సభకు తరలివెళ్లారు. ఓటు చోరీ ఆరోపణలపై కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీయడమే ఈ నిరసన ప్రధాన లక్ష్యమని కాంగ్రెస్ నేతలు ప్రకటించారు.

తాగునీటిని వృథా చేస్తే కుదరదు!

ఇతర అవసరాలకు శుద్ధి చేసిన నీరే
నీటి పొదుపుపై సీఎం హెచ్చరిక
జలమండలి సేవలకు 37 ఏళ్లు

హైదరాబాద్ ప్రజలకు నిరంతర తాగునీటి సరఫరా, మురుగునీటి నిర్వహణలో హైదరాబాద్ మెట్రోపాలిటన్ వాటర్ సప్లై అండ్ సీవరేజ్ బోర్డు అందిస్తున్న సేవలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభినందించారు. జలమండలి 37వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది వారి కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. గత 37 ఏళ్లుగా నగర ప్రజలకు తాగునీరు అందించడంతో పాటు మురుగునీటి వ్యవస్థను నిర్వహిస్తూ నగర అభివృద్ధి, ప్రజారోగ్య పరిరక్షణలో కీలక పాత్ర పోషిస్తోందని ప్రశంసించారు. హైదరాబాద్ వేగంగా విస్తరిస్తున్న నేపథ్యంలో భవిష్యత్తు అవసరాలను దృష్టిలో పెట్టుకుని నీటి భద్రతకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు.

తాగునీటి వనరుల పరిరక్షణే లక్ష్యం

ఎల్‌నినో వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో తాగునీటి వనరులను కాపాడుకోవడం అత్యవసరమని సీఎం స్పష్టం చేశారు. అందుబాటులో ఉన్న తాగునీటిని పొదుపుగా వినియోగించాలని, గృహావసరాలకు కాకుండా ఇతర పనులకు శుద్ధి చేయని తాగునీటిని వాడటాన్ని తగ్గించాలని సూచించారు. నగరంలో నీటి అవసరాలు పెరుగుతున్నందున ప్రతి నీటి చుక్కను బాధ్యతగా వినియోగించాల్సిన అవసరం ఉందన్నారు. ఈక్రమంలో జలమండలి ప్రారంభించిన 'డయల్ గ్రీన్ ట్యాంకర్ - గ్రీన్ ట్యాంకర్ ఆపరేషన్స్' కార్యక్రమాన్ని కీలక ముందడుగుగా అభివర్ణించారు. శుద్ధి చేసిన మురుగునీటిని ఇతర అవసరాలకు మళ్లించడం ద్వారా తాగునీటి వనరులపై ఒత్తిడి తగ్గుతుందని పేర్కొన్నారు.

పరిశ్రమలు, నిర్మాణ సంస్థలకు సీఎం పిలుపు

ప్రభుత్వ శాఖలు, పరిశ్రమలు, నిర్మాణ సంస్థలు, వాణిజ్య సముదాయాలు తమ అవసరాలకు శుద్ధి చేసిన మురుగునీటినే విస్తృతంగా వినియోగించాలని రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. ముఖ్యంగా తోటల నిర్వహణ, నిర్మాణ పనులు, పారిశ్రామిక అవసరాలకు ఈ నీటిని ఉపయోగించాలని సూచించారు. ఇలా చేయడం వల్ల నాణ్యమైన తాగునీటిని ప్రజల నిత్యావసరాలకు అందుబాటులో ఉంచవచ్చని వివరించారు. నీటి పొదుపు ప్రభుత్వ బాధ్యత మాత్రమే కాదని, ప్రజలు, అన్ని వర్గాల భాగస్వామ్యంతోనే సాధ్యమని పేర్కొన్నారు. నీటి సంరక్షణను సామూహిక బాధ్యతగా స్వీకరించి, నీటి భద్రత కలిగిన హైదరాబాద్ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. కోర్ అర్బన్ రీజియన్ (CURE) పరిధిలో ప్రజలకు మరింత మెరుగైన సేవలందిస్తూ జలమండలి భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధిస్తుందని సీఎం ఆశాభావం వ్యక్తం చేశారు.

రైతుల కన్నీళ్లకు రేవంత్ సమాధానం చెప్పాలి!

108 మంది అన్నదాతల ఆత్మహత్యలు : కేటీఆర్

ఆదిలాబాద్ రైతు గర్జన సభలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. తెలంగాణలో రైతుల పరిస్థితి రోజురోజుకూ దయనీయంగా మారుతోందని, ప్రభుత్వ నిర్లక్ష్యం అన్నదాతల జీవితాలను సంక్షోభంలోకి నెట్టిందని ఆరోపించారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో 108 మంది రైతులు ఆత్మహత్యలకు పాల్పడటం తనను తీవ్రంగా కలచివేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులకు భరోసా కల్పించాల్సిన ప్రభుత్వం వారిని పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. రైతు బంధు బకాయిలు చెల్లించకుండా, రుణమాఫీ హామీని పూర్తిస్థాయిలో అమలు చేయకుండా, కౌలు రైతులకు సాయం అందించకుండా అన్నదాతలను ఇబ్బందులకు గురిచేస్తున్నారని విమర్శించారు. రైతు బీమా పథకాన్ని కూడా కాంగ్రెస్ ప్రభుత్వం నిర్వీర్యం చేస్తే రైతు కుటుంబాలకు దిక్కెవరని ప్రశ్నించారు. రైతుల ప్రాణాలకు విలువ ఇవ్వని పాలన ఎందుకని రేవంత్‌రెడ్డిని నిలదీశారు. ఎన్నికల సమయంలో రైతుల సంక్షేమం గురించి గొప్పగా మాట్లాడిన కాంగ్రెస్ నేతలు ఇప్పుడు వారి కష్టాలను ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నించారు.

ప్రభుత్వ బాధ్యతను బీఆర్ఎస్ భుజాన!

రైతు బీమా పథకాన్ని కూడా కాంగ్రెస్ ప్రభుత్వం బొందపెట్టే పరిస్థితి తీసుకొస్తే తాము చూస్తూ ఊరుకోబోమని కేటీఆర్ స్పష్టం చేశారు. ఆత్మహత్యలకు పాల్పడిన అన్నదాతల కుటుంబాలను ఆదుకోవాల్సిన బాధ్యతను ప్రభుత్వం విస్మరిస్తోందని విమర్శించారు. అందుకే ప్రభుత్వమే చేయాల్సిన పనిని బీఆర్ఎస్ తన భుజాలపై వేసుకుని బాధిత కుటుంబాలకు అండగా నిలుస్తోందని తెలిపారు. రైతు కుటుంబాలకు ఆర్థికంగా, సామాజికంగా భరోసా కల్పించేందుకు తమ పార్టీ ముందుకొస్తోందని చెప్పారు. రైతులు అప్పుల బాధతో ప్రాణాలు తీసుకునే పరిస్థితి రావడం రాష్ట్ర పాలకుల వైఫల్యానికి నిదర్శనమని వ్యాఖ్యానించారు. రేవంత్‌రెడ్డిగారూ.. రైతుల సమస్యలను రాజకీయ అంశంగా చూడకండి. అన్నదాతల కుటుంబాల కన్నీళ్లు తుడవండి. రైతు బీమా, రైతుబంధు, రుణమాఫీ హామీలను అమలు చేయండి అంటూ డిమాండ్ చేశారు. రైతులకు నిధులు లేవని చెప్పే ప్రభుత్వం ఇతర రాజకీయ అవసరాలకు మాత్రం ఖర్చు చేయడం ఏమిటని ప్రశ్నించారు. ఆదిలాబాద్ రైతు గర్జన ద్వారా రైతుల సమస్యలను రాష్ట్రవ్యాప్తంగా చర్చకు తీసుకెళ్లాలని కేటీఆర్ ప్రయత్నించారు. రైతుల సంక్షేమం విషయంలో ప్రభుత్వం తన బాధ్యత నుంచి తప్పించుకోలేదని స్పష్టం చేశారు. అన్నదాతలకు న్యాయం జరిగే వరకు బీఆర్ఎస్ పోరాటం కొనసాగిస్తుందని ప్రకటించారు.



గంటకు 280 కి.మీ వేగం
భారత్‌లో తొలి బుల్లెట్ రైలు సిద్ధం!

- స్వదేశీ సాంకేతికతతో హైస్పీడ్ ప్రయాణం!
- ఎనిమిది కోచ్‌లు.. 557 మంది ప్రయాణికులు
- బెంగళూరులో తయారీ.. దేశంలో కొత్త చరిత్ర!

ముంబై-అహ్మదాబాద్ హైస్పీడ్ రైలు కారిడార్ కోసం ప్రత్యేకంగా ఈ రైలును రూపొందిస్తున్నారు. విదేశీ సాంకేతికతపై పూర్తిగా ఆధారపడకుండా భారత ఇంజినీర్లు దేశ వాతావరణ పరిస్థితులు, ప్రయాణ అవసరాలకు అనుగుణంగా దీన్ని అభివృద్ధి చేస్తున్నారు. ఈ రైలు గరిష్ఠ పరీక్షా వేగం గంటకు 280 కిలోమీటర్లు కాగా, వాణిజ్య కార్యకలాపాల్లో గంటకు 249 కిలోమీటర్ల వేగంతో ప్రయాణించనుంది. మొత్తం 202 మీటర్ల పొడవుతో ఎనిమిది కోచ్‌లు ఉంటాయి. వీటిలో నాలుగు మోటార్ కోచ్‌లు, నాలుగు ట్రైలర్ కోచ్‌లు ఉంటాయి. మొత్తం 557 మంది ప్రయాణికులు ప్రయాణించే సౌకర్యం కల్పించారు. భవిష్యత్తులో రెండు రైళ్లను అనుసంధానించి 16 కోచ్‌ల రైలుగా కూడా నడిపే అవకాశం ఉంది.

ప్రయాణికులకు అత్యాధునిక సౌకర్యాలు!

ఈ బుల్లెట్ రైలులో ఏడు సాధారణ తరగతి కోచ్‌లు, ఒక ఎగ్జిక్యూటివ్ తరగతి కోచ్ ఉంటాయి. సాధారణ కోచ్‌లలో 3+2 సీటింగ్, ఎగ్జిక్యూటివ్ కోచ్‌లో 2+2 సీటింగ్ ఏర్పాటు చేస్తున్నారు. విశాలమైన సీట్లు, ఎక్కువ లెగ్‌రూమ్, ప్రతి వరుసకు పెద్ద కిటికీలు, లగేజీ ర్యాకులు ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయి. మొబైల్ ఫోన్లు, ల్యాప్‌టాప్‌ల కోసం వ్యక్తిగత విద్యుత్ సదుపాయాలు కల్పిస్తున్నారు. ఆధునిక బయో డైజెస్టర్ మరుగుదొడ్లు, ఏసీ వ్యవస్థ, శబ్దాన్ని తగ్గించే ప్రత్యేక ఏర్పాట్లు ఉంటాయి. దివ్యాంగుల కోసం ప్రత్యేక సీట్లు, అనుకూలమైన టాయిలెట్లు, బ్రెయిలీ సూచికలు ఏర్పాటు చేస్తున్నారు. రైలు నుంచి ప్లాట్‌ఫామ్‌కు సులభంగా చేరుకునేలా సమతల ప్రవేశ సదుపాయం కల్పిస్తున్నారు.

వైఫై నుంచి అత్యాధునిక బ్రేకింగ్ వరకు!

ప్రయాణికులకు ఇంగ్లిష్, హిందీ, ప్రాంతీయ భాషల్లో సమాచారం అందించే ఎల్‌సీడీ తెరలు, ఆటోమేటిక్ ప్రకటన వ్యవస్థలు ఏర్పాటు చేస్తున్నారు. హైస్పీడ్ వైఫై ఆధారిత వినోద సదుపాయం, అత్యవసర పరిస్థితుల్లో రైలు సిబ్బందితో మాట్లాడేందుకు ప్రత్యేక టాక్‌బ్యాక్ వ్యవస్థ అందుబాటులో ఉంటుంది. ప్రతి కోచ్‌లో ఉష్ణోగ్రత, తేమను నియంత్రించే ఆధునిక హెచ్‌వీఏసీ వ్యవస్థ పనిచేస్తుంది. 25 కేవీ ఏసీ విద్యుత్ వ్యవస్థతో నడిచే ఈ రైలులో రీజెనరేటివ్ బ్రేకింగ్ సాంకేతికత ద్వారా బ్రేకులు వేసినప్పుడు ఉత్పత్తయ్యే విద్యుత్‌ను తిరిగి గ్రిడ్‌కు పంపిస్తారు. గాలి నిరోధకతను తగ్గించే ఏరోడైనమిక్ ఆకృతి, సొరంగాల్లో శబ్దాన్ని నియంత్రించే ప్రత్యేక డిజైన్ కూడా దీని ప్రత్యేకతలు. వేగం, సౌకర్యం, భద్రత, పర్యావరణ హిత సాంకేతికత కలగలిసిన ఈ స్వదేశీ బుల్లెట్ రైలు భారత రవాణా రంగంలో సరికొత్త మైలురాయిగా నిలవనుంది.

పరిశ్రమలకు రహదారులే అభివృద్ధి బాట!

మౌలిక వసతులపై సీఎస్ ప్రత్యేక దృష్టి
హైతాబాద్‌లో పరిశ్రమల సందర్శన



రాష్ట్రంలో పారిశ్రామిక అభివృద్ధిని వేగవంతం చేయడంతో పాటు పెట్టుబడులను ఆకర్షించేందుకు ప్రభుత్వం మౌలిక సదుపాయాల బలోపేతంపై దృష్టి సారించింది. ఇందులో భాగంగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు ఆదివారం రంగారెడ్డి జిల్లా షాబాద్ మండలంలోని హైతాబాద్ ప్రాంతంలో క్షేత్రస్థాయి పర్యటన నిర్వహించారు. తొలుత సీటీఆర్ఎల్ఎస్, వెల్‌స్పన్ పరిశ్రమలను సందర్శించి, వాటికార్యకలాపాలను పరిశీలించారు. కంపెనీల ప్రతినిధులతో మాట్లాడి ఉత్పత్తి సామర్థ్యం, పారిశ్రామిక అవసరాలు, ప్రస్తుతం అందుబాటులో ఉన్న మౌలిక సదుపాయాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. భవిష్యత్తులో పరిశ్రమల విస్తరణకు అవసరమైన సౌకర్యాలపై చర్చించారు. పరిశ్రమల ప్రతినిధులు తమ సంస్థల ప్రస్తుత పరిస్థితి, భవిష్యత్ ప్రణాళికలను సీఎస్‌కు వివరించారు.

రేడియల్ రోడ్డు పనులపై ఆరా

పరిశ్రమల సందర్శన అనంతరం హైతాబాద్ ప్రాంతంలో నిర్మాణంలో ఉన్న రేడియల్ రోడ్డు పనులను సంజయ్ జాజు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ముఖ్యంగా రేడియల్ రోడ్డు సంబర్ 2లో చైనేజ్ 20.50 కిలోమీటర్ల వద్ద జరుగుతున్న నిర్మాణ పనుల పురోగతిని సమీక్షించారు. పరిశ్రమలకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించడంలో ఈ రహదారుల ప్రాధాన్యతను అధికారులు వివరించారు.

రవాణా అనుసంధానమే కీలకం

పారిశ్రామిక అభివృద్ధి, పెట్టుబడుల ఆకర్షణ, ఆర్థిక కార్యకలాపాల విస్తరణకు పటిష్టమైన మౌలిక సదుపాయాలు, మెరుగైన రహదారి అనుసంధానం అత్యంత కీలకమని సీఎస్ సంజయ్ జాజు స్పష్టం చేశారు. ఈ పర్యటనలో ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ కమిషనర్ శశాంక, రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి, ఆర్డీఓ పార్థసింహా రెడ్డి, సంబంధిత ఇంజినీరింగ్ అధికారులు, తహసీల్దార్, పరిశ్రమల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఫోన్ ట్యాపింగ్ కేసు
హరీశ్‌రావుపై అదనపు సెక్షన్లు!

సిద్దిపేటకు చేరిన కేసు దర్యాప్తు



తెలంగాణలో సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావుకు సంబంధించిన కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. హైదరాబాద్‌లోని పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌లో నమోదైన కేసు సిద్దిపేట వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌కు బదిలీ అయింది. అక్కడ పోలీసులు కొత్తగా ఎఫ్ఐఆర్ నమోదు చేస్తూ పాత కేసులోని అభియోగాలకు అదనంగా మరో ఆరు సెక్షన్లు చేర్చారు. ఐపీసీలోని 419, 420, 467, 406 సెక్షన్లతో పాటు ఐటీ చట్టంలోని 66సీ, 66డీ సెక్షన్లను కూడా పొందుపరిచారు. ఈ సెక్షన్ల చేరికతో కేసు దర్యాప్తు పరిధి మరింత విస్తరించే అవకాశం ఉంది.


ఏ1గా హరీశ్‌రావు.. ఫిర్యాదుతో కేసు!

ఈ కేసులో హరీశ్‌రావును ఏ1గా, అప్పటి టాస్క్‌ఫోర్స్ డీసీపీగా పనిచేసిన రాధాకిషన్‌రావును ఏ2గా పోలీసులు పేర్కొన్నారు. చక్రధర్‌గౌడ్ ఇచ్చిన ఫిర్యాదే ఈ కేసుకు ఆధారం. 2023లో తనతో పాటు తన భార్య ఫోన్లను అక్రమంగా ట్యాప్ చేశారని, తమ వ్యక్తిగత గోప్యతకు భంగం కలిగించారని ఆయన ఆరోపించారు. ఈ ఫిర్యాదుపై 2024 డిసెంబర్ 1న పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. తాజాగా సిద్దిపేటకు బదిలీ అయిన కేసులో అదనపు సెక్షన్లు చేర్చడంతో తదుపరి దర్యాప్తుపై ఆసక్తి నెలకొంది. ఫోన్ ట్యాపింగ్ వెనుక ఎవరెవరి పాత్ర ఉంది? నిబంధనలకు విరుద్ధంగా నిఘా పెట్టారా? అన్న అంశాలపై పోలీసులు విచారణ కొనసాగించనున్నారు. అయితే ఇవన్నీ ఫిర్యాదులోని ఆరోపణలు మాత్రమే. దర్యాప్తులో వెల్లడయ్యే అంశాలు కీలకం కానున్నాయి.

మురాసు తుపాను ముప్పు

నేడు, రేపు భారీ వర్షాలు!

బంగాళాఖాతంలో ఏర్పడిన మురాసు తుపాను ప్రభావంతో తెలంగాణలో వాతావరణం మారనుంది. ఆదివారం నుంచే రాష్ట్రంలోని పలు జిల్లాల్లో వర్షాలు ప్రారంభమయ్యాయని... హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ, జనగామతో పాటు హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ సహా పలు జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురిసాయి. సోమవారం వర్షాల తీవ్రత మరింత పెరగనుంది. ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబ్‌నగర్, వసపర్తి జిల్లాలకు భారీ నుంచి అత్యంత భారీ వర్షాల హెచ్చరిక జారీ చేసింది. ఈ జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ ప్రకటించింది. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ ప్రాంతాల్లోనూ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది.



మంగళవారం రెడ్ అలర్ట్

మంగళవారం, సవంబర్ 3 వర్షాల తీవ్రత గరిష్ఠ స్థాయికి చేరే సూచనలు ఉన్నాయని వాతావరణ శాఖ హెచ్చరించింది. ఖమ్మం, సూర్యాపేట, మహబూబాబాద్ జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీ చేసింది. ఈ ప్రాంతాల్లో అత్యంత భారీ వర్షాలు కురిసే ప్రమాదం ఉంది. భద్రాద్రి కొత్తగూడెం, వరంగల్, హనుమకొండ జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ ప్రకటించింది.

ప్రజాస్వామ్యానికి చీకటి రోజు

- పులివెందుల నుంచి విశాఖ వరకు అక్రమాలు
- చంద్రబాబు ప్రభుత్వంపై జగన్ తీవ్ర విమర్శలు

ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ ఎన్నికల పోలింగ్ సందర్భంగా ప్రజాస్వామ్యం ఖూనీ అవుతోందంటూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి తీవ్ర ఆరోపణలు చేశారు. పట్టపగలే పోలింగ్ అక్రమాలు జరుగుతున్నాయని, వైఎస్సార్సీపీ పోలింగ్ ఏజెంట్లను బలవంతంగా బయటకు పంపిస్తున్నారని, ఓటు వేయడానికి వస్తున్న ప్రజలను బెదిరిస్తూ వారి ఓటు హక్కును అడ్డుకుంటున్నారని ఆరోపించారు. పోలీసుల సమక్షంలోనే ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయని పేర్కొంటూ 'హే రామ్.. ప్రజాస్వామ్యాన్ని కాపాడండి' అంటూ సోషల్ మీడియా వేదికగా ఆవేదన వ్యక్తం చేశారు.

70 కేంద్రాల్లో ఏజెంట్లకు నో!

తన సొంత నియోజకవర్గమైన పులివెందుల మున్సిపాలిటీలో పరిస్థితి మరింత దారుణంగా ఉందని జగన్ ఆరోపించారు. మొత్తం 80 పోలింగ్ కేంద్రాల్లో 70 కేంద్రాలకు వైఎస్సార్సీపీ పోలింగ్ ఏజెంట్లను అనుమతించలేదని పేర్కొన్నారు. పోలింగ్ కేంద్రాల్లో పార్టీ ఏజెంట్లే లేకపోతే ఓటర్ల గుర్తింపును ఎవరు నిర్ధారిస్తారని ప్రశ్నించారు. ఎన్నికల ప్రక్రియలో పారదర్శకతపై ఈ ఘటనలు అనేక సందేహాలు రేకెత్తిస్తున్నాయని తన పోస్టులో అభిప్రాయపడ్డారు.

రాష్ట్రవ్యాప్తంగా ఇదే పరిస్థితి!

పులివెందులతో పాటు కడప, అనంతపురం, తిరుపతి, కర్నూలు, చిత్తూరు, ఒంగోలు, గుంటూరు, నెల్లూరు, విశాఖపట్నం, విజయవాడ, మాచర్ల, చిలకలూరిపేట, వినుకొండ, జమ్మలమడుగు, నంద్యాల, చీమకుర్తి, ఎమ్మిగనూరు, సూళ్లూరుపేట, పలాస, నాయుడుపేట, నందిగామ, జగ్గయ్యపేట, కుప్పం, పుత్తూరు, భీమునిపట్నం, పార్వతీపురం తదితర ప్రాంతాల్లోనూ ఇలాంటి ఘటనలు చోటుచేసుకున్నాయని జగన్ ఆరోపించారు. పలు పట్టణాల్లో పోలింగ్ ఏజెంట్లను అడ్డుకోవడం, ఓటర్లను భయభ్రాంతులకు గురిచేయడం వంటి పరిణామాలు కనిపించాయని పేర్కొన్నారు.

బాబు పాలనపై జగన్ విమర్శలు!

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పాలనలో ఆంధ్రప్రదేశ్ ఎన్నికల వ్యవస్థ ప్రమాదకర పరిస్థితుల్లోకి వెళ్తోందని జగన్ విమర్శించారు. ప్రజాస్వామ్య సంస్థలు అధికారంలో ఉన్నవారి ప్రభావానికి లోనవుతున్నాయని ఆరోపించారు. ఇది ఎన్నికల ప్రక్రియలా కాకుండా, ముందే నిర్ణయించుకున్నవారిని ఎంపిక చేసుకునే వ్యవస్థలా మారుతోందంటూ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ప్రజల తీర్పును పక్కదారి పట్టించే ప్రయత్నాలు జరుగుతున్నాయని తన పోస్టులో మండిపడ్డారు.

జగన్ ఆరోపణలకు లోకేశ్ కౌంటర్

- పులివెందుల పోలింగ్‌పై మాటల యుద్ధం
- ఓటమి భయంతోనే గందరగోళం సృష్టించారు

పులివెందుల మున్సిపల్ ఎన్నికల సందర్భంగా వైఎస్సార్సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేసిన ఆరోపణలకు మంత్రి నారా లోకేశ్ ఘాటుగా స్పందించారు. ఎన్నికల్లో అక్రమాలు జరుగుతున్నాయన్న జగన్ వ్యాఖ్యలను ఖండిస్తూ, గతంలో ఆయన ముఖ్యమంత్రిగా ఉన్నసమయంలో పులివెందుల మున్సిపాలిటీలో ఏకగ్రీవ విజయాలు సాధించారని గుర్తుచేశారు. ప్రస్తుత ప్రభుత్వం మాత్రం స్వేచ్ఛగా, పారదర్శకంగా ఎన్నికలు నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేసిందని స్పష్టం చేశారు. నామినేషన్లు దాఖలు చేసుకునే అభ్యర్థులకు పోలీసు రక్షణ కల్పించామని తెలిపారు. జగన్, వైఎస్సార్సీపీ నేతలే శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తూ ఆ నెపాన్ని టీడీపీపై వేస్తున్నారని విమర్శించారు.

అచ్చెన్నాయుడు విమర్శలు!

పులివెందుల మున్సిపల్ ఎన్నికల్లో ప్రజల తీర్పును ఎదుర్కొనే ధైర్యం లేక జగన్ ఓటు వేయకుండా వెళ్లిపోయారని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఎద్దేవా చేశారు. ఐదేళ్లు ముఖ్యమంత్రిగా పనిచేసిన వ్యక్తి సొంత నియోజకవర్గంలో ఓటు హక్కు వినియోగించుకోకపోవడం ఏమిటని ప్రశ్నించారు. పోలింగ్ సందర్భంగా వైసీపీ శ్రేణులు రాళ్ల దాడులు, బెదిరింపులకు పాల్పడుతున్నాయని ఆరోపించారు. మహిళలు, వృద్ధులు స్వేచ్ఛగా ఓటు వేసే వాతావరణాన్ని అడ్డుకుంటున్నారని విమర్శించారు. జర్నలిస్టులపై దాడులు, పోలింగ్ కేంద్రాల వద్ద ఘర్షణలు ప్రజాస్వామ్యానికి ప్రమాదకరమని పేర్కొన్నారు. హింసకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఎన్నికల నియమావళి ఉల్లంఘించారు

ఎన్నికల నియమావళి అమల్లో ఉండగా జగన్ రోడ్‌షో నిర్వహించడంతో పాటు అనుమతించిన పరిమితులకు మించి ప్రజలతో మమేకమయ్యారని లోకేశ్ ఆరోపించారు. ఫిర్యాదు చేసేందుకు అవకాశం ఇచ్చినా రాష్ట్ర ఎన్నికల సంఘానికి అధికారికంగా వినతిపత్రం సమర్పించలేదని విమర్శించారు. మరోవైపు టీడీపీ ఎమ్మెల్యేలు బూర్ల రామాంజనేయులు, బోండా ఉమా మహేశ్వరరావు కూడా జగన్‌పై విమర్శలు గుప్పించారు.

73వ డివిజన్ ఐదు కేంద్రాల్లో రీపోలింగ్‌కు డిమాండ్



విజయవాడ నగరపాలక సంస్థ 73వ డివిజన్‌లోని ఐదు పోలింగ్ కేంద్రాల్లో రీపోలింగ్ నిర్వహించాలని స్వతంత్ర అభ్యర్థి ఏవీ వెంకటేశ్వరరావు (ఏబీవీ) డిమాండ్ చేశారు. రాజరాజేశ్వరిపేట కేర్ అండ్ షేర్ వీఎంసీ పాఠశాల పోలింగ్ కేంద్రం వద్ద టీడీపీ, వైసీపీ వర్గాల మధ్య ఘర్షణ జరగడంతో ఓటర్లు భయంతో చెదిరిపోయారని, పలువురు మహిళలు ఓటు వేయకుండానే వెళ్లిపోయారని ఆరోపించారు. ఫొటోలు, వీడియోలతో ఎన్నికల సంఘం, పోలీసులకు ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోలేదని విమర్శించారు. వైసీపీకి చెందిన ఇద్దరిని అదుపులోకి తీసుకుని, టీడీపీ వారిపై చర్యలు తీసుకోలేదని అభ్యంతరం వ్యక్తం చేశారు. సీపీఎం నేత బాబూరావు, కాంగ్రెస్ నగర అధ్యక్షుడు నరహరిశెట్టి నరసింహారావుతో కలిసి పోలింగ్ కేంద్రం వెలుపల నిరసనకు దిగారు. రాత్రి ఎనిమిది గంటల వరకు కొనసాగిన ఆందోళనపై డీసీపీ కృష్ణకాంత్ పటేల్, ఇద్దరు ఏసీపీలు చర్చించారు. అర్ధరాత్రి 12 గంటల్లోపు నిర్ణయం వెల్లడిస్తామని రిటర్నింగ్ అధికారిణి హామీ ఇవ్వడంతో నిరసనను తాత్కాలికంగా విరమించారు.

అక్రమాలతో గెలుపు కోసం ఆరాటం

- 360 బూత్‌లలో ఏజెంట్ల తొలగింపు
- న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామన్న సజ్జల

మున్సిపల్ ఎన్నికల పోలింగ్‌లో అధికార కూటమి అక్రమాలకు పాల్పడిందని వైఎస్సార్సీపీ రాష్ట్ర కోఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి తీవ్రంగా ఆరోపించారు. ప్రతిపక్ష పార్టీ పోలింగ్ ఏజెంట్లను కేంద్రాల్లోకి అనుమతించకుండా రిగ్గింగ్‌కు పాల్పడ్డారని విమర్శించారు. నామినేషన్ల దశ నుంచి పోలింగ్ వరకు పోలీసులను, అధికారులను ఉపయోగించుకుని తమ అభ్యర్థులను అడ్డుకున్నారని ఆరోపించారు. నామినేషన్ పత్రాలు చించడం, అభ్యర్థుల పేర్లు తుది జాబితా నుంచి తొలగించడం, బలపంతపు ఉపసంహరణలు, అక్రమ కేసులతో బెదిరించడం వంటి ఘటనలు జరిగాయని పేర్కొన్నారు. సుప్రీంకోర్టు ఆదేశించినా అన్ని పోలింగ్ కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయలేదని, సుమారు 360 బూత్‌ల నుంచి తమ ఏజెంట్లను బయటకు పంపించారని ఆరోపించారు. పులివెందులలో మాజీ సీఎం జగన్‌కు కూడా ఆటంకాలు కల్పించారని, మహిళలు, ఓటర్లను భయపెట్టారని విమర్శించారు.

కృత్రిమ విజయాన్ని ప్రజలు అంగీకరించరు!

మాచర్ల, చిలకలూరిపేట, జమ్మలమడుగు, మదనపల్లె, డోన్, తాడిపత్రి, చీమకుర్తి, కుప్పం, పులివెందుల, కడప, చిత్తూరు తదితర ప్రాంతాల్లో రీపోలింగ్ అవసరమని తమకు సమాచారం అందిందని సజ్జల వెల్లడించారు. నెల్లూరు, కర్నూలు, ఒంగోలు, వినుకొండ, మార్కాపురం, ఎమ్మిగనూరు, నగరి సహా పలు ప్రాంతాల్లోనూ అక్రమాలు జరిగినట్లు ఆధారాలు సేకరిస్తున్నామని తెలిపారు. ఎన్నికల సంఘం తక్షణమే సీసీటీవీ ఫుటేజ్, వెబ్‌కాస్టింగ్ ఆధారాలను పరిశీలించి చర్యలు తీసుకోవాలని కోరారు.

మురసు సైక్లోన్ ముప్పు

- తీరానికి డేంజర్ బెల్స్!
- 110 కి.మీ. వేగంతో గాలులు
- 3న తీరం దాటే అవకాశం

బంగాళాఖాతంలో ఏర్పడిన 'మురసు' తుపాను ఆంధ్రప్రదేశ్ తీరంవైపు వేగంగా కదులుతోంది. నవంబర్ 1 సాయంత్రం 5.30 గంటల సమయానికి గంటకు 25 కిలోమీటర్ల వేగంతో పశ్చిమ వాయవ్య దిశగా ప్రయాణిస్తున్నట్లు భారత వాతావరణ శాఖ వెల్లడించింది. నవంబర్ 2 తెల్లవారుజామున తీవ్ర తుపానుగా మారే అవకాశం ఉందని హెచ్చరించింది. నవంబర్ 3 తెల్లవారుజామున 2 గంటల నుంచి 4 గంటల మధ్య నెల్లూరు నుంచి నర్సాపురం మధ్య దక్షిణ ఆంధ్రప్రదేశ్ తీరాన్ని దాటే అవకాశముందని తెలిపింది. తీరం దాటే సమయంలో గంటకు 100 నుంచి 110 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశం ఉందని, గరిష్ఠంగా 120 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీయవచ్చని అంచనా వేసింది.

మురసు ప్రభావంతో నవంబర్ 2న దక్షిణ, మధ్య కోస్తా జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. కొన్ని ప్రాంతాల్లో అత్యంత భారీ వర్షాలు పడవచ్చని ఐఎండీ హెచ్చరించింది. నవంబర్ 3, 4 తేదీల్లోనూ భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే సూచనలున్నాయి. ఏలూరు జిల్లాలో 9, కృష్ణాలో 5, ఎన్టీఆర్ జిల్లాలో 5, బాపట్లలో ఒక మండలానికి అత్యంత భారీ వర్ష సూచన ఉంది. నవంబర్ 3న ఏలూరులో 179, కృష్ణాలో 163, ఎన్టీఆర్ జిల్లాలో 161, పశ్చిమగోదావరిలో 147, గుంటూరులో 119, బాపట్లలో 104 మిల్లీమీటర్ల సగటు వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని అధికారులు అంచనా వేశారు.

కడప కోటపై 'సువర్ణా' ధ్యాయం!

- మేయర్ కాబోతున్న తొలి మహిళ..
- వైఎస్ మార్క్ రాజకీయానికి ముగింపు పలకనున్న టీడీపీ జెండా!



కడప రాజకీయ చరిత్రలో మరో కీలక అధ్యాయం మొదలుకాబోతోందా? దశాబ్దాలుగా వైఎస్ కుటుంబ రాజకీయ ప్రాబల్యానికి కేంద్రంగా ఉన్న కడప నగర పాలనపై తొలిసారిగా తెలుగుదేశం పార్టీ జెండా ఎగరబోతోందా? మేయర్ పీఠంపై డాక్టర్ మట్టి సువర్ణ ఆశలు నిజమవుతాయా? ఈ ప్రశ్నలన్నింటికీ నవంబర్ 3న వెలువడే ఎన్నికల ఫలితాలు సమాధానం చెప్పనున్నాయి. నవంబర్ 1న జరిగిన కడప నగర పాలక సంస్థ ఎన్నికలు సాధారణ స్థానిక పోరుగా కాకుండా జిల్లా రాజకీయ భవిష్యత్తును ప్రభావితం చేసే ఎన్నికలుగా మారాయి. 2005లో కార్పొరేషన్‌గా ఏర్పడినప్పటి నుంచి కడప మేయర్ పీఠం కాంగ్రెస్, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీల చేతుల్లోనే కొనసాగింది. తొలి మేయర్‌గా పోచిమరెడ్డి రవీంద్రనాథ్ రెడ్డి కాంగ్రెస్ తరపున బాధ్యతలు చేపట్టారు. ఆ తర్వాత 2014, 2021 ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధిపత్యం ప్రదర్శించింది. కొత్తమద్ది సురేష్ బాబు రెండుసార్లు మేయర్‌గా వ్యవహరించగా, మధ్యలో జరిగిన ఉప ఎన్నికలో పాకా సురేష్ విజయం సాధించారు. ఇలా ఇప్పటివరకు టీడీపీకి మేయర్ పీఠం అందని ద్రాక్షగానే మిగిలింది. ఇప్పుడు ఆ చరిత్రను తిరగరాసే అవకాశం కూటమి ముందుకొచ్చింది. మొత్తం 66 డివిజన్లలో 52 డివిజన్లు కూటమి ఖాతాలో ఏకగ్రీవంగా చేరడం ఈ ఎన్నికల్లో అత్యంత కీలక పరిణామం. మిగిలిన 14 డివిజన్లలో మాత్రమే పోలింగ్ జరిగింది. ఒకప్పుడు వైఎస్ కుటుంబానికి తిరుగులేని రాజకీయ బలంగా భావించిన నగరంలో టీడీపీకి ఈ స్థాయి ఆధిక్యం రావడం వెనుక మారిన రాజకీయ పరిస్థితులు, స్థానిక సమీకరణాలు, కూటమి వ్యూహాలు చర్చనీయాంశమయ్యాయి. 2024 అసెంబ్లీ ఎన్నికల తర్వాత రాష్ట్రంలో మారిన రాజకీయ వాతావరణం కడప జిల్లాలోనూ ప్రభావం చూపింది. 27 ఏళ్ల తర్వాత జిల్లా పరిషత్‌పై కూటమి పట్టు సాధించిందన్న రాజకీయ పరిణామం తర్వాత ఇప్పుడు కార్పొరేషన్‌పైనా ఆధిపత్యం సాధించే దిశగా అడుగులు పడుతున్నాయి. 2005లో 50 డివిజన్లతో ప్రారంభమైన కార్పొరేషన్ నేడు 66 డివిజన్లకు విస్తరించింది. నగర విస్తీర్ణం, జనాభా, పట్టణ సమస్యలు పెరిగిన నేపథ్యంలో ఓటర్ల ఆలోచనా విధానంలోనూ మార్పు వచ్చిందన్న చర్చ సాగుతోంది. కడప అంటే ఒకే కుటుంబం, ఒకే రాజకీయ ఆధిపత్యం అనే పాత సమీకరణానికి సవాలు ఎదురవుతోందా? ప్రజలు కొత్త నాయకత్వాన్ని కోరుకుంటున్నారా? అన్న ఉత్కంఠ నగర రాజకీయాలను వేడెక్కిస్తోంది.

సువర్ణ అభ్యర్థిత్వం.. మహిళా నాయకత్వానికి అవకాశం!

ఈ రాజకీయ పోరులో డాక్టర్ మట్టి సువర్ణ అభ్యర్థిత్వం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ప్రముఖ డెంటిస్ట్ డాక్టర్ నేలటూరు మధుసూదనరెడ్డి సతీమణిగా, స్వయంగా గైనకాలజిస్ట్‌గా వైద్యరంగంలో గుర్తింపు పొందిన ఆమె ఇప్పుడు కడప నగర ప్రథమ పౌరురాలి పీఠంపై ఆశలు పెట్టుకున్నారు. మహిళా జనరల్ రిజర్వేషన్ కింద జరిగిన ఈ ఎన్నికలో సువర్ణ విజయం సాధిస్తే కడప చరిత్రలో తొలి మహిళా మేయర్‌గా నిలిచే అవకాశం ఉంది. గతంలో సయ్యద్ ముంతాజ్ బేగం కొంతకాలం ఇన్‌ఛార్జ్ మేయర్‌గా బాధ్యతలు నిర్వహించినప్పటికీ, ప్రత్యక్ష ఎన్నికల ద్వారా మేయర్‌గా బాధ్యతలు చేపట్టే తొలి మహిళగా సువర్ణ పేరు నిలవవచ్చు. వైద్య వృత్తిలో పనిచేసిన అనుభవం ఆమెకు ప్రజారోగ్య సమస్యలపై అవగాహన కల్పించే ప్రత్యేకతగా రాజకీయ వర్గాలు ప్రస్తావిస్తున్నాయి. మహిళలు, పిల్లల ఆరోగ్యం, పేద కుటుంబాలకు వైద్య సేవలు, పారిశుద్ధ్యం, తాగునీరు, మౌలిక సదుపాయాలపై నగర పాలనలో ప్రత్యేక దృష్టి పెట్టాల్సిన అవసరం ఉంది. అయితే వైద్యరంగంలో అనుభవం ఉన్నంత మాత్రాన నగర పాలనలో విజయానికి హామీ లభించదు. ప్రజల అవసరాలను గుర్తించి, పరిపాలనా వ్యవస్థను సమన్వయం చేసి, అభివృద్ధి పనులను వేగంగా అమలు చేయగలగడం అసలైన పరీక్ష. సువర్ణ విజయావకాశాల వెనుక కడప ఎమ్మెల్యే రెడ్డెప్పగారి మాధవిరెడ్డి, టీడీపీ జోనల్ కోఆర్డినేటర్ శ్రీనివాసులరెడ్డి కృషి కూడా చర్చకు వస్తోంది. నగరంలో పార్టీ బలాన్ని పెంచడం, కార్యకర్తలను సమన్వయం చేయడం, డివిజన్లవారీగా వ్యూహాలు రూపొందించడం, ఏకగ్రీవాల దిశగా ప్రయత్నాలు చేయడంలో కూటమి నాయకత్వం కీలకంగా వ్యవహరించినట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. అసెంబ్లీ ఎన్నికల్లో సాధించిన విజయాన్ని నగర పాలనలోనూ కొనసాగించాలన్న లక్ష్యంతో ఎమ్మెల్యే మాధవిరెడ్డి పనిచేశారు. అందుకే ఈ ఎన్నిక ఆమె రాజకీయ ప్రతిష్ఠకు సంబంధించిన పోరుగా కూడా మారింది. అయితే 52 డివిజన్ల ఏకగ్రీవాలు మాత్రమే అంతిమ విజయానికి పూర్తి కొలమానం కావు. మిగిలిన 14 డివిజన్లలో ఓటర్ల తీర్పు, అభ్యర్థుల బలం, సామాజిక సమీకరణాలు ఫలితాన్ని ప్రభావితం చేయనున్నాయి. కూటమి నాయకత్వం సాధించిన రాజకీయ ఆధిక్యం ఓట్ల రూపంలోనూ ప్రతిఫలిస్తుందా? సువర్ణకు మేయర్ పీఠం దక్కుతుందా? అన్నది తేలాల్సి ఉంది.

వైసీపీకి ప్రతిష్ఠాత్మక పోరు..

నవంబర్ 3పై ఉత్కంఠ!

మరోవైపు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి ఈ ఎన్నిక అత్యంత ప్రతిష్ఠాత్మకంగా మారింది. రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో ఎదురైన పరాజయం తర్వాత సొంత జిల్లాలో రాజకీయ పట్టును నిలబెట్టుకోవడం వైసీపీకి కీలకంగా మారింది. వైఎస్ కుటుంబానికి రాజకీయంగా ప్రత్యేక ప్రాధాన్యత కలిగిన కడప నగర కార్పొరేషన్‌ను కోల్పోతే అది స్థానిక సంస్థలో అధికారం కోల్పోవడానికే పరిమితం కాకుండా జిల్లా రాజకీయాలపైనా ప్రభావం చూపే పరిణామంగా మారవచ్చు. వైసీపీ తరపున బండి దీప్తి రెడ్డి మేయర్ అభ్యర్థిగా బరిలో ఉండగా, ఏఐఎంఐఎం నుంచి షేక్ నసీమ్ బాను పోటీ చేస్తున్నారు. ముస్లిం ఓటర్ల మద్దతు, స్థానిక సామాజిక సమీకరణాలు, అభ్యర్థుల వ్యక్తిగత పరిచయాలు, పార్టీలపై ప్రజల్లో ఉన్న విశ్వాసం ఫలితాన్ని ప్రభావితం చేసే అంశాలుగా మారాయి. మొత్తం 361 పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికలు నిర్వహించారు. సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మక కేంద్రాల వద్ద భారీ భద్రత ఏర్పాటు చేశారు. జిల్లా వ్యాప్తంగా మూడు వేల మంది పోలీసులను మోహరించడంతో పాటు డ్రోన్లు, సీసీటీవీలు, వెబ్‌కాస్టింగ్ ద్వారా పోలింగ్‌ను పర్యవేక్షించారు. పులివెందులలో చోటు చేసుకున్న ఉద్రిక్త పరిణామాలతో పోలిస్తే కడపలో పోలింగ్ ప్రశాంతంగా సాగడం కొంత ఊరటనిచ్చింది. అయితే రాజకీయ పార్టీల అంచనాలు, ఏకగ్రీవాల లెక్కలు, నాయకుల వ్యూహాలు ఎలా ఉన్నా అంతిమ నిర్ణయం ఓటర్లదే. నవంబర్ 3న వెలువడే ఫలితాలు కడప రాజకీయాల్లో కొత్త సమీకరణాలకు దారి తీసే అవకాశం ఉంది. కూటమికి అనుకూలంగా ఫలితాలు వస్తే కార్పొరేషన్ చరిత్రలో తొలిసారిగా టీడీపీ మేయర్ పీఠాన్ని దక్కించుకునే అవకాశం ఉంటుంది. డాక్టర్ మట్టి సువర్ణ ఎన్నికైతే నగరానికి తొలి మహిళా మేయర్‌గా చరిత్ర సృష్టిస్తారు. అదే సమయంలో వైసీపీ తన పట్టును నిలబెట్టుకుంటే కూటమి నాయకత్వానికి కొత్త రాజకీయ సవాళ్లు ఎదురవుతాయి. ఒకవైపు వైఎస్ కుటుంబ రాజకీయ వారసత్వం.. మరోవైపు కడపలో కొత్త ఆధిపత్యం కోసం టీడీపీ ప్రయత్నం.. ఈ రెండింటి మధ్య ఓటరు ఇచ్చిన తీర్పు ఏమిటన్నదే ఇప్పుడు అసలు ఆసక్తి. మాధవిరెడ్డి నాయకత్వానికి ఈ ఫలితం కీలక మైలురాయిగా మారుతుందా? శ్రీనివాసులరెడ్డి వ్యూహాలకు విజయ ఫలితం దక్కుతుందా? సువర్ణ మేయర్ పీఠాన్ని అధిరోహిస్తారా? లేక వైసీపీ తన రాజకీయ పట్టును నిలబెట్టుకుంటుందా? కడప కోటపై సువర్ణాధ్యాయం మొదలవుతుందా? వైఎస్ రాజకీయ ఆధిపత్యానికి కొత్త సవాలు ఎదురవుతుందా? సమాధానం నవంబర్ 3న!



విశాఖ ఓటరు షాక్..

పార్టీలకు షాక్!

నగరం నిద్రపోయిందా.. రాజకీయాలపై విరక్తి పెరిగిందా?

- 51.47 శాతం ఓటింగ్ మాత్రమే నమోదు
- వార్డుల మార్పులు.. ఓటర్లకు అయోమయం!

గ్రేటర్ విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్ (జీవీఎంసీ) ఎన్నికలు రాష్ట్రవ్యాప్తంగా రాజకీయ వర్గాలను ఆశ్చర్యపరిచాయి. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఇతర పురపాలక సంఘాలు, కార్పొరేషన్లలో 60 శాతానికి పైగా పోలింగ్ నమోదుకాగా.. విశాఖలో మాత్రం ఓటర్లు పెద్ద సంఖ్యలో ఇళ్లకే పరిమితమయ్యారు. నగరంలో చాలా తక్కువ పోలింగ్ నమోదైందన్న సమాచారం సంచలనం సృష్టించింది. ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలు, పది జోనల్ కార్యాలయాల పరిధిలో జరిగిన ఈ ఎన్నికలు విశాఖ రాజకీయాల్లో కొత్త చర్చకు తెరతీశాయి. నగరాన్ని అంతర్జాతీయ స్థాయిలో అభివృద్ధి చేస్తామని పాలకులు చేసిన ప్రకటనలు ఓటర్లను పోలింగ్ కేంద్రాల వరకు తీసుకురాలేకపోయాయి. పెరుగుతున్న జనాభాకు తగిన రహదారులు, తాగునీరు, పారిశుద్ధ్యం, ఇతర ప్రాథమిక సౌకర్యాలు అందడం లేదన్న అసంతృప్తి ప్రజల్లో ఉందని కొన్ని వర్గాలు భావిస్తున్నాయి. ఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా నగరానికి ఆశించిన ప్రయోజనం కలగడం లేదనే అభిప్రాయం కూడా సామాజిక మాధ్యమాల్లో చర్చకు వచ్చింది. గతంలో ఎన్నడూ లేనంతగా ఓటర్లు ఎన్నికల ప్రక్రియకు దూరంగా ఉండటం రాజకీయ పార్టీలకు ఆలోచించాల్సిన పరిస్థితిని కల్పించింది. ముఖ్యంగా యువత, ఎగువ మధ్యతరగతి, ఉన్నత వర్గాల నుంచి పోలింగ్ కేంద్రాలకు పెద్దగా స్పందన కనిపించలేదు. వృద్ధులు, మహిళలు మాత్రమే కొంతవరకు ఓటు హక్కు వినియోగించుకున్నారు. నగర అభివృద్ధిపై ప్రజలకు ఉన్న ఆశలు, ఎన్నికలపై కనిపించిన నిరాసక్తత మధ్య అంతరం స్పష్టంగా బయటపడింది. ఓటు వేయడానికి ప్రజలు రాకపోవడం కేవలం పోలింగ్ శాతం తగ్గడం కాదు.. పాలకులపై ప్రజల్లో ఉన్న అసంతృప్తికి సంకేతమా? అన్న ప్రశ్న ఇప్పుడు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

ఈ సారి జీవీఎంసీ పరిధిలో వార్డుల సంఖ్యను 120కి పెంచడంతో పాటు భౌగోళిక విభజనలోనూ భారీ మార్పులు జరిగాయి. భీమునిపట్నం, అనకాపల్లి, పెందుర్తి, గాజువాకతో పాటు విశాఖ తూర్పు, పడమర, ఉత్తరం, దక్షిణం నియోజకవర్గాల పరిధులు కార్పొరేషన్‌లోకి వచ్చాయి. జోనల్ కార్యాలయాల సంఖ్య పదికి చేరింది. ఓటర్ల సంఖ్య కూడా భారీగా పెరిగి దాదాపు 19 లక్షల మంది ఓటు హక్కు వినియోగించుకుంటారని అంచనా వేశారు. అయితే వార్డుల పునర్విభజన, బూతుల మార్పులు, ఓటర్ల జాబితా సవరణలు ప్రజలకు కొత్త సమస్యలు తెచ్చాయి. గతంలో ఒకే వార్డులో ఉన్న ప్రాంతాలు రెండు వార్డులుగా విడిపోవడంతో ఓటర్లు తమ కొత్త వార్డు వివరాలు తెలుసుకోవడంలో ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఇటీవల చేపట్టిన ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ కూడా కొంత గందరగోళానికి కారణమైంది. సాధారణంగా ఎన్నికల సమయంలో స్థానిక నాయకులు, పార్టీ కార్యకర్తలు ఇళ్లకు వెళ్లి ఓటరు స్లిప్పులు అందించేవారు. ఏ పోలింగ్ కేంద్రంలో ఓటు వేయాలో వివరించేవారు. ఈసారి ఆ ప్రక్రియ పూర్తిస్థాయిలో జరగలేదన్న విమర్శలు వినిపించాయి. సచివాలయ సిబ్బంది ద్వారా వివరాలు అందిస్తామని చెప్పినా, అవి ఎప్పుడు, ఎక్కడ లభిస్తాయన్న స్పష్టత లేకపోవడంతో చాలామంది ఓటర్లు ఇబ్బందులు పడ్డారు. ఉదయం ఏడు గంటలకు పోలింగ్ ప్రారంభమైనా పది గంటల సమయానికి కేవలం మూడు శాతం మాత్రమే ఓటింగ్ నమోదైంది. మధ్యాహ్నం రెండు గంటల తర్వాత కొంత సందడి కనిపించినా చివరి వరకు ఓటర్ల రాక పెరగలేదు. ఎన్నికల ప్రకటన హడావిడిగా రావడం, ప్రచారానికి తగిన సమయం లేకపోవడం, వార్డుల మార్పులపై సమాచారం అందకపోవడం పరిస్థితిని మరింత ప్రభావితం చేశాయి. ఏ వార్డులో ఎవరు పోటీ చేస్తున్నారు? ఏ పార్టీ అభ్యర్థి బరిలో ఉన్నారు? అన్న వివరాలపై కూడా చాలామందికి స్పష్టత లేదని స్థానికంగా చర్చ జరిగింది. మహిళలకు రిజర్వేషన్ల కారణంగా కొత్త అభ్యర్థులు బరిలోకి దిగడం, మేయర్ అభ్యర్థుల ప్రచారం పరిమితంగా ఉండటం కూడా ఎన్నికలపై ఆసక్తిని పెంచలేకపోయాయి. ఓటరు ఎక్కడ ఓటు వేయాలో తెలియని పరిస్థితి ఏర్పడితే ప్రజాస్వామ్య ప్రక్రియలో పాల్గొనడం ఎలా సాధ్యం? అన్న ప్రశ్న ఈ ఎన్నికల నిర్వహణపై నిలుస్తోంది.

అవినీతి ఆరోపణలు..

రాజకీయ గందరగోళం!

విశాఖలో పోలింగ్ తగ్గడానికి ఎన్నికల నిర్వహణలో సమస్యలతో పాటు గత పాలకవర్గంపై ఉన్న విమర్శలు కూడా కారణమయ్యాయని కొన్ని వర్గాలు విశ్లేషిస్తున్నాయి. గత ఐదేళ్లలో జీవీఎంసీలో అవినీతి పెరిగిందన్న ఆరోపణలు రాజకీయంగా విస్తృతంగా ప్రచారంలోకి వచ్చాయి. వైకాపా పాలనలో పెద్ద ఎత్తున అక్రమాలు జరిగాయంటూ ప్రత్యర్థులు విమర్శలు చేశారు. అనంతరం తెలుగుదేశం పార్టీకి చెందిన ప్రతినిధి మేయర్‌గా బాధ్యతలు చేపట్టారు. అవిశ్వాస తీర్మానం తర్వాత కొత్త మేయర్ వచ్చినా నగర అభివృద్ధిలో చెప్పుకోదగిన మార్పు కనిపించలేదని కొందరు ప్రజలు భావించినట్లు స్థానిక చర్చలు సూచిస్తున్నాయి. మరోవైపు కూటమి పార్టీల్లో టికెట్ల కేటాయింపు వివాదాలు అభ్యర్థుల ప్రచారాన్ని దెబ్బతీశాయి. నామినేషన్ల గడువు సమీపించినా బీఫారాలు ఇవ్వకపోవడం, సీట్ల సర్దుబాటుపై విభేదాలు, నాయకుల మధ్య పోటీ కార్యకర్తల్లోనూ గందరగోళం సృష్టించాయి. అర్బన్ తుపాను ప్రభావంతో భారీ వర్షాలు కురవడంతో ప్రచారానికి లభించిన కొద్ది పాటి సమయం కూడా తగ్గిపోయింది. అభ్యర్థులు ఎవరు? గెలిస్తే వార్డు అభివృద్ధికి ఏం చేస్తారు? ప్రజలకు వారి ప్రణాళిక ఏమిటి? అన్న అంశాలు ఓటర్లకు చేరలేదు. ఫలితంగా ఎన్నికలపై ఆసక్తి తగ్గింది. ఈ పరిణామాలన్నీ కలిసివచ్చి విశాఖలో పోలింగ్ శాతాన్ని గణనీయంగా తగ్గించాయని విశ్లేషణలు చెబుతున్నాయి. ఇప్పుడు అందరి దృష్టి మేయర్ పీఠంపై పడింది. మంగళవారం జరిగే పరిణామాలతో జీవీఎంసీ పాలనా పగ్





ఓట్ చోరీపై దద్దరిల్లిన ఢిల్లీ!

- కేంద్రంపై ఇండియా కూటమి పోరు..
- రామలీలా మైదానంలో ప్రతిపక్షాల గర్జన!
- జనసంద్రంగా రామలీలా మైదానం!

ఢిల్లీలోని రామలీలా మైదానం ఆదివారం ప్రతిపక్షాల నిరసనతో హోరెత్తింది. 'ఓట్ బచావో.. దేశ్ బచావో' నినాదంతో ఇండియా కూటమి నిర్వహించిన భారీ సభకు కాంగ్రెస్, ఇతర ప్రతిపక్ష పార్టీల నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవడం కోసం ఇది కేవలం ర్యాలీ మాత్రమే కాదని, దేశవ్యాప్త ఉద్యమానికి నాంది అని కాంగ్రెస్ అభివర్ణించింది. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే నివాసం నుంచి సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, అఖిలేశ్ యాదవ్, మమతా బెనర్జీ తదితర నేతలు ప్రత్యేక బస్సులో ర్యాలీ ప్రాంగణానికి చేరుకున్నారు. ఓటర్ల జాబితాలో అక్రమాలు జరుగుతున్నాయనే ఆరోపణలపై కేంద్ర ఎన్నికల సంఘాన్ని నిలదీయడమే ఈ సభ ప్రధాన ఉద్దేశం. రికార్డు స్థాయిలో ప్రజలు పాల్గొన్నారని కాంగ్రెస్ నేతలు ప్రకటించారు. ఓటు చోరీకి వ్యతిరేకంగా ప్రజలు ఏకమయ్యారని, ప్రజాస్వామ్య పరిరక్షణకు తమ పోరాటం కొనసాగుతుందని పార్టీ పేర్కొంది.

మోదీపై రాహుల్ గురి.. జ్ఞానేశ్‌కు హెచ్చరిక!

సభలో రాహుల్ గాంధీ ప్రధానమంత్రి నరేంద్ర మోదీపై తీవ్ర ఆరోపణలు చేశారు. ఓట్ల చోరీ ద్వారా అధికారాన్ని నిలబెట్టుకునే ప్రయత్నం జరుగుతోందని విమర్శించారు. ప్రధానమంత్రి మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా చట్టం నుంచి తప్పించుకోలేరని హెచ్చరించారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌పై కూడా రాహుల్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. భవిష్యత్తులో ఆయన పదవి నుంచి తొలగించబడటమే కాకుండా, దేశద్రోహం ఆరోపణలపై జైలుకు వెళ్లాల్సి వస్తుందని వ్యాఖ్యానించారు. ఎన్నికల అక్రమాలకు



బాధ్యత వహించాల్సిందేనని స్పష్టం చేశారు. సభ ముగిసిన తర్వాత ఢిల్లీలోని మింటో రోడ్డుతో పాటు పలు ప్రాంతాల్లో నిరసన నినాదాలు కనిపించాయి. 'ఓట్ చోర్.. గద్దీ చోర్', 'సర్‌ను వెనక్కి తీసుకోవాలి', 'అక్రమ ప్రధాని' వంటి నినాదాలను గోడలపై స్ప్రే పెయింట్‌తో రాశారు.

రాంలీలా ర్యాలీ అట్టర్ ఫ్లాప్.. బీజేపీ సెటైర్లు!

జనం లేని మైదానం.. రాహుల్‌పై విమర్శలు

ఢిల్లీలోని రాంలీలా మైదానంలో ఇండియా కూటమి నిర్వహించిన 'చలో ఢిల్లీ' ర్యాలీపై బీజేపీ తీవ్ర విమర్శలు గుప్పించింది. ప్రతిపక్షాల సభ అట్టర్ ఫ్లాప్ అయిందని, రాహుల్ గాంధీ ప్రసంగిస్తున్న సమయంలోనే జనం మైదానం నుంచి వెళ్లిపోయారని ఆరోపించింది. సభకు పది లక్షల మంది వస్తారని కాంగ్రెస్ ప్రచారం చేసిందని, కానీ మైదానంలో దాదాపు 40 శాతం ఖాళీగా కనిపించిందని ఎద్దేవా చేసింది. భారీ జనసమీకరణ ఉన్నట్లు చూపించేందుకు ట్రిక్ ఫోటోగ్రఫీకి పాల్పడ్డారని విమర్శించింది. ఫోటోల్లో జనసందోహాన్ని చూపించినంత మాత్రాన ఎవరూ ప్రధానమంత్రి కాలేరంటూ బీజేపీ నేతలు వ్యంగ్యాస్త్రాలు సంధించారు. ఓటర్ల జాబితాల అక్రమాలపై విపక్షాలు చేస్తున్న ప్రచారాన్ని ప్రజలు పట్టించుకోవడం లేదని పేర్కొన్నారు.

ఎన్నికలపై పిటిషన్ ఎక్కడ?

బీజేపీ అధికార ప్రతినిధి సాంబిత్ పాత్రా మీడియాతో మాట్లాడుతూ.. 2024 లోక్‌సభ ఎన్నికలు అక్రమంగా జరిగాయని ఆరోపిస్తున్న రాహుల్ గాంధీ ముందుగా న్యాయస్థానంలో పిటిషన్ దాఖలు చేయాలని సవాల్ విసిరారు. ఎన్నికలపై అభ్యంతరాలు ఉంటే ఫలితాలు వెలువడిన వెంటనే సవాలు చేయాలని, రాంలీలా మైదానంలో ప్రసంగాలు చేస్తే ఎన్నికలు అక్రమమైపోవని వ్యాఖ్యానించారు. 2024 ఎన్నికలు చట్టవిరుద్ధమని పేర్కొంటూ దాఖలు చేసిన పిటిషన్ ఏదో చూపించాలని ప్రశ్నించారు. శివుడి బారాత్, శివతాండవం మధ్య తేడా కూడా రాహుల్‌కు తెలియదంటూ విమర్శించారు. వచ్చే ఎన్నికల్లో ప్రజలే తమ తీర్పుతో రాజకీయ తాండవం



చూపిస్తారని హెచ్చరించారు.

రాహుల్ ఆరోపణలకు బీజేపీ కౌంటర్!

మరోవైపు ర్యాలీలో రాహుల్ గాంధీ ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌పై తీవ్ర ఆరోపణలు చేశారు. ఓటు చోరీ సాధారణ దొంగతనం కాదని, దేశ ప్రజల గొంతును దొంగిలించడమేనని అభివర్ణించారు. జ్ఞానేశ్ కుమార్ పాత్ర వల్లే మోదీ ప్రధాని, అమిత్ షా హోంమంత్రి అయ్యారని ఆరోపిస్తూ ఆయన జైలుకు వెళ్తారని వ్యాఖ్యానించారు. రైతులు, యువత, కార్మికులకు న్యాయం జరగడం లేదని, దేశ సంపద కొద్దిమంది చేతుల్లోనే కేంద్రీకృతమైందని విమర్శించారు. ఈ ర్యాలీలో సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్, తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి మమతా బెనర్జీ సహా పలువురు విపక్ష నేతలు పాల్గొన్నారు. మింటో రోడ్-కనాట్ ప్లేస్ కూడలి నుంచి ప్రారంభమైన ప్రదర్శన రాంలీలా మైదానానికి చేరుకుంది. ఎన్నికల అక్రమాల ఆరోపణలతో మొదలైన రాజకీయ పోరు ఇప్పుడు సభకు వచ్చిన జనంపై విమర్శలతో మరింత వేడెక్కింది.

జ్ఞానేశ్ కుమార్ జైలుకే

చట్టం ముందు మోదీషా తప్పించుకోలేరన్న రాహుల్
ఓటు హక్కును దొంగలను ఊరుకోం!

ఢిల్లీలోని రాంలీలా మైదానం వేదికగా ఇండియా కూటమి నిర్వహించిన 'ప్రజాస్వామ్య పరిరక్షణ' భారీ ర్యాలీలో లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ సంచలన వ్యాఖ్యలు చేశారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌పై తీవ్ర ఆరోపణలు గుప్పిస్తూ.. ప్రజల ఓటు హక్కును దొంగిలించినందుకు ఆయనను పదవి నుంచి తొలగించడమే కాకుండా జైలుకు పంపిస్తామని హెచ్చరించారు. ప్రజల గొంతును అణచివేయడం సాధారణ నేరం కాదని, దేశద్రోహంతో సమానమైన తీవ్రమైన చర్యగా అభివర్ణించారు. దేశవ్యాప్తంగా ఇండియా కూటమి నేతలు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలిరావడంతో రాంలీలా మైదానం జనసంద్రంగా మారింది.

మోదీ, అమిత్ షాలకు రాహుల్ హెచ్చరిక!

ఓటు చోరీ వ్యవహారంలో ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షాలపైనా న్యాయపరమైన చర్యలు తప్పవని రాహుల్ స్పష్టం చేశారు. జ్ఞానేశ్ కుమార్‌పై పోరాటం ముగిసిన తర్వాత మోదీ, అమిత్ షాలపై తమ పోరాటం కొనసాగుతుందని ప్రకటించారు. 2024 ఎన్నికల్లో మోదీ ప్రభుత్వం పొందిన ప్రజాతీర్పు అక్రమమని ఆరోపించారు. మధ్యప్రదేశ్, హర్యానా, ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో ఓటర్ల పేర్లను తీర్చడం, తొలగించడం ద్వారా ఫలితాలను ప్రభావితం చేశారని విమర్శించారు. 2024 లోక్‌సభ ఎన్నికల తర్వాత 13 కోట్ల మంది ఓటర్ల పేర్లు తొలగించారని, ఇది మొత్తం ఓటర్లలో 15 శాతమని రాహుల్ ఆరోపించారు.

ద్వేష రాజకీయాలకు చరమగీతం!

మోదీ అనంతరం దేశం ఎలా ఉండాలన్న అంశంపైనా రాహుల్ తన ఆలోచనలను వెల్లడించారు. కులం, మతం, ప్రాంతంతో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరికీ సమాన అవకాశాలు కల్పించే భారతదేశం నిర్మించాలన్నారు. రైతు తన కష్టానికి తగిన ఫలితం పొందాలని, 18 గంటలు చదివే విద్యార్థికి ఉద్యోగం లభించాలని ఆకాంక్షించారు. దేశ సంపద మొత్తం ఒక్కరి చేతుల్లోనే కేంద్రీకృతం కాకుండా అడ్డుకుంటామని, గౌతమ్ అదానీ పేరును ప్రస్తావిస్తూ విమర్శలు చేశారు. మోదీ, అమిత్ షా, ఆర్ఎస్ఎస్ ద్వేషాన్ని పెంచుతున్నాయని ఆరోపిస్తూ.. దేశానికి ఇప్పుడు ద్వేషం కాదు, ప్రేమ, సామరస్యం అవసరమని పిలుపునిచ్చారు. వ్యక్తుల మతం కంటే వారి గొంతుకే తనకు ముఖ్యమని స్పష్టం చేశారు.

ఇండియా కూటమి నేతలంతా ఒక్కతాటిపై!

ఈ ర్యాలీలో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, సోనియా గాంధీతో పాటు అఖిలేష్ యాదవ్, మమతా బెనర్జీ, తేజస్వి యాదవ్, ఫరూక్ అబ్దుల్లా, మెహబూబా ముఫ్తీ తదితర విపక్ష నేతలు పాల్గొన్నారు. ప్రజాస్వామ్య పరిరక్షణ పోరాటాన్ని అఖిలేష్ యాదవ్ ప్రజా ఉద్యమంగా అభివర్ణించగా, పశ్చిమ బెంగాల్‌లో ఎస్ఐఆర్ ప్రక్రియను మమతా బెనర్జీ విమర్శించారు. ఓట్లు దొంగిలించేవారికి వ్యతిరేకంగా నేడు మహాభారత పోరాటం సాగుతోందని తేజస్వి యాదవ్ వ్యాఖ్యానించారు. మోదీ ప్రభుత్వాన్ని గద్దె దించడం, ఎన్నికల వ్యవస్థలో పారదర్శకత తీసుకురావడమే లక్ష్యంగా ఇండియా కూటమి నేతలు తమ ఐక్యతను చాటారు. ఎన్నికల సంఘం విశ్వసనీయతపై రగులుతున్న రాజకీయ వివాదం ఈ ర్యాలీతో మరింత వేడెక్కింది.

బీజేపీకి యూపీలోనే రాజకీయ సమాధి

- అధికారంలోకి తెచ్చిన ప్రజలే సాగనంపుతారు!
- మార్పునకు సంకేతంగా జనసందోహం!
- ప్రజాస్వామ్యానికి హల్దీఘాటీగా రాంలీలా మైదాన్!
- సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్ ఫైర్

ఢిల్లీలోనిరాంలీలామైదాన్ప్రజాస్వామ్యపోరాటానికి యుద్ధభూమిగా మారిందని సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్ వ్యాఖ్యానించారు. ఓటు చోరీకి వ్యతిరేకంగా ఇండియా కూటమి నిర్వహించిన భారీ ర్యాలీలో ఆయన మాట్లాడుతూ.. రాంలీలా మైదాన్ ప్రజాస్వామ్యానికి మరో హల్దీఘాటీగా మారిందని అభివర్ణించారు. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం అక్కడ జరుగుతున్న పోరాటం చారిత్రక యుద్ధాన్ని తలపిస్తోందని, అది ఒక కీలక పోరాట వేదికగా మారిందని అభివర్ణించారు. ప్రజల భారీగా తరలిరావడం దేశ రాజకీయాల్లో రాబోయే మార్పునకు సంకేతమని అన్నారు. ఉత్తరప్రదేశ్ ప్రజల మద్దతుతో కేంద్రంలో అధికారంలోకి వచ్చినవారిని అదే రాష్ట్ర ప్రజలు తిరిగి సాగనంపుతారని హెచ్చరించారు. ప్రజలను ఆహ్వానించడంలోనే కాదు, అవసరమైతే అధికారంలో ఉన్నవారికి వీడ్కోలు పలకడంలోనూ యూపీ ప్రజలు ముందుంటారని ఘాటుగా వ్యాఖ్యానించారు.

ఓటర్ల జాబితాల్లో భారీ అక్రమాలు!

ఉత్తరప్రదేశ్‌లో ఓటర్ల పేర్ల తొలగింపుపై అఖిలేశ్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ర్యాలీ జరుగుతున్న సమయంలోనే రాష్ట్రంలో 1.27 లక్షల మంది హిందూ ఓటర్ల పేర్లు తొలగించినట్లు సమాచారం వచ్చిందని ఆరోపించారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో సగటున 31 వేల ఓట్లు తగ్గించే ప్రయత్నం జరుగుతోందని విమర్శించారు. వారణాసి ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రజలు బీజేపీ డబుల్ ఇంజిన్ ప్రభుత్వాన్ని డబుల్ జీరోగా మార్చారని ఎద్దేవా చేశారు. పశ్చిమ బెంగాల్ ఎన్నికల్లోనూ ఎస్ఐఆర్ ప్రక్రియ ద్వారా ఓట్లను తారుమారు చేసి ఎన్నికలను దోచుకున్నారని ఆరోపించారు. 2022లో యూపీలో సమాజ్‌వాదీ పార్టీ అధికారంలోకి రాకపోవడానికి కూడా ఓట్ల చోరీనే కారణమని పేర్కొన్నారు.

యూపీ నుంచే మార్పు మొదలు!

ఒకప్పుడు భారత్‌ను విశ్వగురువుగా మారుస్తామని గొప్పలు చెప్పుకున్నవారు ఇప్పుడు ఓటర్ల జాబితాలను తారుమారు చేసే పనిలో ఉన్నారని అఖిలేశ్ బీజేపీపై విరుచుకుపడ్డారు. అంగదుడి పాదంలా తమ స్థానం కదలదని చెప్పుకునేవారికి అసలు నిలబడేందుకు నేలే మిగల్లేదని వ్యంగ్యాస్త్రాలు సంధించారు. ఓటు హక్కును కాపాడేందుకు ఇండియా కూటమి పోరాటం ఆపబోదని స్పష్టం చేశారు. ప్రజాస్వామ్యాన్ని రక్షించే ఉద్యమం ఉత్తరప్రదేశ్ నుంచే ప్రారంభమవుతుందని ప్రకటించారు. మార్పు ఎప్పుడైనా రావచ్చని, ప్రజలే ఆ మార్పునకు పునాది వేస్తారని ధీమా వ్యక్తం చేశారు. రాంలీలా మైదాన్‌లో కనిపించిన జనసమీకరణ బీజేపీకి రాబోయే రాజకీయ సవాళ్లను సూచిస్తోందని ఆయన వ్యాఖ్యలు స్పష్టం చేశాయి.

చొరబాటుదారుల కోసం కాంగ్రెస్ పోరాటం!

అక్రమదారులను దేశం నుంచి తరిమేస్తాం!
బీజేపీ చీఫ్ నితిన్ నబీన్ సంచలన ఆరోపణలు



దేశంలో మూడు కోట్ల మంది చొరబాటుదారులు ఉన్నారని, వారిని కాపాడేందుకు కాంగ్రెస్ పార్టీ పోరాటం చేస్తోందని బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ ఆరోపించారు. హర్యానాలోని రోహ్‌తక్‌లో ఆదివారం నిర్వహించిన 'లోక్‌తంత్ర బచావో.. అరాజకతా హటావో' పాదయాత్రలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. దేశ పౌరుల ప్రయోజనాల కంటే కాంగ్రెస్ తన రాజకీయ ప్రయోజనాలకే ప్రాధాన్యత ఇస్తోందని విమర్శించారు. బీజేపీ, ఎన్డీఏ కార్యకర్తలు ఉన్నంతవరకు చొరబాటుదారులను దేశం నుంచి పంపించే బాధ్యత తీసుకుంటామని ప్రకటించారు. భారతీయ పౌరులకు మాత్రమే రాజ్యాంగం కల్పించిన హక్కులు దక్కాలని, అక్రమంగా దేశంలో ఉంటున్నవారికి ఆ హక్కులు వర్తించకూడదని స్పష్టం చేశారు.

రాహుల్ గాంధీ లక్ష్యంగా విమర్శలు

లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీని లక్ష్యంగా చేసుకుని నితిన్ నబీన్ తీవ్ర విమర్శలు చేశారు. దేశంలోని 140 కోట్ల మంది ప్రజలపై నమ్మకం లేకుండా మూడు కోట్ల మంది చొరబాటుదారులపై ఎందుకు నమ్మకం పెట్టుకున్నారని ప్రశ్నించారు. ఓటర్ల జాబితాల నుంచి 13 కోట్ల ఓట్లు తొలగించారన్న విపక్షాల ఆరోపణలను ప్రస్తావిస్తూ.. తొలగించిన ఓట్ల వివరాలను బీజేపీ మండల స్థాయి కార్యకర్త కూడా వెల్లడించగలడని అన్నారు. రాజ్యాంగ సంస్థలను కాంగ్రెస్ అవమానిస్తోందని, ప్రజాతీర్పును గౌరవించడం లేదని విమర్శించారు. ఒకే కుటుంబం చేతుల్లో కాంగ్రెస్ నడుస్తోందని, ఆ పార్టీ నేతలు రాహుల్ ఆదేశాల ప్రకారమే వ్యవహరిస్తున్నారని ఆరోపించారు.

1984 అల్లర్లపై కాంగ్రెస్‌ను నిలదీత!

హర్యానా రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా నవంబర్ 1న జరిగిన ఈ పాదయాత్రకు బీజేపీ నేతలు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఢిల్లీలో ఇండియా కూటమి నిర్వహించిన 'ఓటు బచావో.. దేశ్ బచావో' ర్యాలీకి పోటీగా బీజేపీ ఈ కార్యక్రమాన్ని చేపట్టింది. 1984 సిక్కు వ్యతిరేక అల్లర్లను ప్రస్తావించిన నితిన్ నబీన్.. వేలాది మంది సిక్కుల మరణాలకు కాంగ్రెస్ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. రాజీవ్ గాంధీ గతంలో చేసిన 'పెద్ద చెట్టు కూలితే భూమి కంపిస్తుంది' వ్యాఖ్యను గుర్తుచేస్తూ కాంగ్రెస్ పశ్చాత్తాపం వ్యక్తం చేయాలని అన్నారు. ఇందిరాగాంధీ ఎన్నికను రద్దు చేసిన అలహాబాద్ హైకోర్టు తీర్పును ప్రస్తావిస్తూ ఎన్నికల ప్రక్రియను దుర్వినియోగం చేసిన చరిత్ర కాంగ్రెస్‌కు ఉందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో స్మృతి ఇరానీ, హర్యానా బీజేపీ అధ్యక్షురాలు అర్చనా గుప్తా పాల్గొన్నారు.



ఎన్నికల సామగ్రి భద్రతకు ప్రత్యేక ఏర్పాట్లు

విజయవాడలో మున్సిపల్ ఎన్నికల సామగ్రి స్వీకరణ, స్ట్రాంగ్ రూమ్‌లలో భద్రపరిచే ప్రక్రియను సమన్వయంతో పూర్తి చేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర అధికారులను ఆదేశించారు. ఆదివారం ఆంధ్రా లయోలా కాలేజీలో శాఖాధిపతులతో నిర్వహించిన సమీక్షలో పోలింగ్ కేంద్రాల నుంచి చేరే సామగ్రి స్వీకరణ, భద్రతపై దిశానిర్దేశం చేశారు. మూడు నియోజకవర్గాల బాధ్యతలను ముగ్గురు అదనపు కమిషనర్లకు అప్పగించి, వారి పర్యవేక్షణలో జోనల్ అధికారులు పనిచేయాలని సూచించారు. ప్రతి సర్కిల్ అధికారి సంబంధిత రిటర్నింగ్ అధికారితో సమన్వయం చేసుకుంటూ నిర్దేశిత విధానంలో సామగ్రిని స్వీకరించి స్ట్రాంగ్ రూమ్‌లకు తరలించాలని స్పష్టం చేశారు. రిసెప్షన్ ప్రక్రియలో ప్రతి దశను నిరంతరం పర్యవేక్షిస్తూ ఎన్నికల సామగ్రి భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని కమిషనర్ పేర్కొన్నారు.

దివ్యాంగులకు సదరం స్లాట్ బుకింగ్ ప్రారంభం

ప్రొద్దుటూరులో సదరం ధ్రువపత్రాల కోసం స్లాట్ బుకింగ్ ప్రక్రియ నవంబర్ 2 నుంచి ప్రారంభం కానుంది. ఈ విషయాన్ని మున్సిపల్ కమిషనర్ తూతిక శ్రీనివాస విశ్వనాథ్ ఆదివారం వెల్లడించారు. సదరం సర్టిఫికెట్లు లేని అర్హులైన దివ్యాంగులను గుర్తించి, వార్డు సచివాలయాల ద్వారా వివరాలు సేకరించి స్లాట్లు కేటాయించాలని అధికారులను ఆదేశించారు. వెల్ఫేర్, ఎడ్యుకేషన్, అడ్మిన్ కార్యదర్శులు సమన్వయంతో పనిచేస్తూ వివరాలను గూగుల్ షీట్‌లో నమోదు చేయాలని సూచించారు. సదరం ధ్రువపత్రంతో అర్హులకు నెలకు రూ.6 వేల పింఛన్‌తో పాటు విద్య, ఉద్యోగాల్లో రిజర్వేషన్లు, ఉచిత బస్సు ప్రయాణం, రైల్వే రాయితీలు లభిస్తాయని తెలిపారు. స్వయం ఉపాధి రుణాలు, ట్రైసైకిళ్లు, వీల్‌చైర్లు, వినికిడి యంత్రాలు వంటి ప్రయోజనాలూ పొందవచ్చన్నారు. అర్హులు తమ వార్డు సచివాలయాన్ని సంప్రదించి వివరాలు నమోదు చేసుకోవాలని కోరారు.



బెంగాల్‌ను బలిచేసిన ఎస్ఐఆర్

- బీజేపీపై కలిసికట్టుగా పోరాటం!
- సీజేపీ, జెన్‌జీకి మమతా అభినందనలు!

ఢిల్లీలోని రాంలీలా మైదానంలో ఇండియా కూటమి నిర్వహించిన ప్రజాస్వామ్య పరిరక్షణ ర్యాలీలో తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి మమతా బెనర్జీ బీజేపీపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ (ఎస్ఐఆర్)ను రాజకీయ ఆయుధంగా ఉపయోగిస్తూ ప్రతిపక్ష పాలిత రాష్ట్రాలను లక్ష్యంగా చేసుకుంటున్నారని ఆరోపించారు. ముఖ్యంగా పశ్చిమ బెంగాల్ ఈ ప్రక్రియ కారణంగా తీవ్రంగా నష్టపోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. బీజేపీకి ఎస్ఐఆర్ అంటే 'స్పెషల్ ఇంటెన్సివ్ రిలీఫ్'గా మారిందంటూ వ్యంగ్యాస్త్రాలు సంధించారు. బెంగాల్‌ను దోచుకున్నారని, అయితే ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకు తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. ఎన్నికల్లో ఓడిపోలేదని, తమను ఓడించారని ఆరోపిస్తూ ఈ అన్యాయంపై ప్రజాస్వామ్యబద్ధంగానే పోరాడతామని ప్రకటించారు.

జ్ఞానేశ్ కుమార్‌పై ఘాటు వ్యాఖ్యలు!

ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌ను లక్ష్యంగా చేసుకుని మమతా బెనర్జీ వ్యంగ్యంగా ప్రశ్నించారు. 'వానిష్ కుమార్ జీ.. మీరు ఎప్పుడు మాయమవుతారు? మీ కోసం ఎదురుచూస్తున్నాం' అంటూ వ్యాఖ్యానించారు. ఓటు చోరీ, ప్రజాస్వామ్య చోరీ అంటూ చిన్నపిల్లల ప్రాచుర్యం పొందిన పాటను మార్చి పాడుతూ బీజేపీపై విమర్శలు గుప్పించారు. ఉద్యోగాలు, ప్రజల జీవితాలు, మహిళల గౌరవాన్ని బెబ్బతీశారని ఆరోపించారు. ఎన్నికలను సైతం హైజాక్ చేశారని మండిపడ్డారు. పోలీసులు బీజేపీకి మిత్రులుగా మారారని, కేంద్ర ఉన్నత సంస్థలు, రాజ్యాంగ వ్యవస్థలను అధికార పార్టీ తన రాజకీయ ప్రయోజనాలకు ఉపయోగించుకుంటోందని విమర్శించారు.



యువతకు మమతా పిలుపు!

ఈ సందర్భంగా సిటిజెన్స్ ఫర్ జస్టిస్ అండ్ పీస్ (సీజేపీ) నాయకత్వం, జెన్‌జీ కార్యకర్తలకు మమతా బెనర్జీ సంఘీభావం ప్రకటించారు. వారి పోరాట స్ఫూర్తికి మద్దతు తెలిపారు. కులం, మతం, ప్రాంతం, రాజకీయ అనుబంధాలతో సంబంధం లేకుండా అన్నివర్గాల ప్రజలు ఒక్కటవ్వాలని పిలుపునిచ్చారు. యువత, వామపక్షాలు, అన్ని సామాజిక వర్గాలు ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం చేతులు కలపాలని కోరారు. దేశాన్ని కాపాడాలంటే ప్రజాస్వామ్యాన్ని రక్షించాలని స్పష్టం చేశారు. బీజేపీ అధికారం నుంచి తప్పుకోవడం ఖాయమంటూ పలుమార్లు నినదించారు. విపక్షాల ఐక్యతతోనే అధికార పార్టీని ఎదుర్కోగలమని మమతా బెనర్జీ తన ప్రసంగం ద్వారా స్పష్టమైన రాజకీయ సందేశం ఇచ్చారు.

నినాదాలు ఆపండి.. లేదంటే గంటసేపు!

ఖర్గే వార్నింగ్‌తో రాంలీలా మైదానంలో నవ్వులు

ఢిల్లీలోని రాంలీలా మైదానంలో ఇండియా కూటమి నిర్వహించిన భారీ ర్యాలీలో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే తనదైన శైలిలో కార్యకర్తలకు చురకలంటించారు. ప్రసంగించేందుకు వేదికపైకి వచ్చిన ఆయన దాదాపు 30 సెకన్ల పాటు మౌనంగా నిలబడ్డారు. కార్యకర్తల నినాదాలు, సంగీత వాయిద్యాల హోరుతో ప్రసంగానికి అంతరాయం కలగడంతో అసహనం వ్యక్తం చేశారు. 'మీరు నిశ్శబ్దంగా ఉంటే ఐదు నిమిషాల్లో ప్రసంగం ముగిస్తా.. లేకపోతే గంట సేపు మాట్లాడతా' అంటూ సరదాగా హెచ్చరించారు. దీంతో సభలో నవ్వులు వినిపించాయి. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌కు వ్యతిరేకంగా నినాదాలు కొనసాగుతున్నప్పటికీ ఖర్గే ప్రసంగం ఆసక్తికరంగా మారింది. చివరకు ఆయన ఐదు నిమిషాల బదులు తొమ్మిది నిమిషాలు మాట్లాడారు.

మోదీపై వ్యాఖ్యల వివాదం మళ్లీ ప్రస్తావన!

ఇటీవల బిహార్‌లోని పాట్నాలో జరిగిన సభలో ప్రధాని మోదీపై ఖర్గే చేసిన వ్యాఖ్యలు మరోసారి రాంలీలా మైదానంలో చర్చకు వచ్చాయి. 'మోదీ ఎక్కడికీ వెళ్లరు' అనే నినాదానికి స్పందిస్తూ ఖర్గే చేసిన వ్యాఖ్యలు వివాదానికి దారితీశాయి. దీనిపై బీజేపీ క్షమాపణలు కోరుతూ దేశవ్యాప్త నిరసనలకు పిలుపునిచ్చింది. తాజాగా ఢిల్లీ సభలోనూ కొందరు కార్యకర్తలు అదే నినాదాన్ని ప్రస్తావించగా ఖర్గే తన ప్రసంగంలో 'మోదీ వెళ్తేనే ప్రజాస్వామ్యం బతుకుతుంది' అని వ్యాఖ్యానించారు. మరోవైపు రాహుల్ గాంధీ జ్ఞానేశ్ కుమార్‌ను పదవి నుంచి తొలగించి జైలుకు పంపాలని డిమాండ్ చేశారు. సోనియా గాంధీ, ప్రియాంక గాంధీ, అఖిలేశ్ యాదవ్, మమతా బెనర్జీ సహా పలువురు నేతలు పాల్గొన్న ఈ ర్యాలీకి ముందు మింటో రోడ్ నుంచి రాంలీలా మైదానం వరకు సుమారు కిలోమీటన్నర ప్రదర్శన నిర్వహించారు.



ఏసీబీ వలలో అధికారులు

లంచం తీసుకుంటూ పట్టుబడ్డారు.. అక్రమాస్తుల గుట్టు బయటపడింది.. ఏసీబీ సోదాల్లో కోట్ల రూపాయల ఆస్తులు వెలుగుచూశాయి.. ఇక కఠిన చర్యలు తప్పవని ప్రజలు భావించారు. కానీ తెరవెనుక కథ మరోలా సాగుతోంది! దర్యాప్తు పూర్తయింది.. ప్రాసిక్యూషన్‌కు ఏసీబీ సిఫారసు చేసింది.. ప్రభుత్వ అనుమతి మాత్రం రాలేదు! ఫలితం.. ఒక్కటొక్కటిగా కేసులు మూసివేతకు చేరుతున్నాయి. తెలంగాణలో 2023 నుంచి కనీసం 20 ఏసీబీ కేసులు ప్రభుత్వ అనుమతి నిరాకరణతో ముగింపు దశకు వెళ్లినట్లు వెలుగులోకి వచ్చిన వివరాలు ఇప్పుడు సంచలనం రేపుతున్నాయి. లంచం తీసుకుంటూ పట్టుబడిన ఐదు ట్రాప్ కేసులకూ ఇదే పరిస్థితి ఎదురైనట్లు సమాచారం. కోట్ల ఆస్తుల కేసుల్లోనూ శాఖాపరమైన విచారణలే ప్రత్యామ్నాయంగా మారుతున్నాయా? ఏళ్ల తరబడి సాగుతున్న దర్యాప్తులు, అనుమతుల జాప్యాలు, విచారణల్లో అలసత్వం.. ఇవన్నీ అవినీతి నిరోధక వ్యవస్థను ప్రశ్నార్థకం చేస్తున్నాయి. ఉద్యోగుల ఆస్తుల వివరాల వెల్లడిపై నిబంధనలు ఉన్నా అమలు ఎంతవరకు? తప్పు చేసినవారికి శిక్ష పడకపోతే భయం ఎలా పుడుతుంది? ఏసీబీ పట్టుకుంటే కేసు నడుస్తుందా.. లేక ప్రభుత్వ ఉత్తర్వులతో తెరపడుతుందా? అసలు ఈ వ్యవస్థలో లొసుగులు ఎక్కడ? బాధ్యులెవరు? ప్రజాధనాన్ని కాపాడాల్సిన పాలనా యంత్రాంగమే సమాధానం చెప్పాల్సిన ప్రశ్న లివి. అవినీతిపై దాడులు సరిపోవు.. దోషులకు శిక్ష పడాలి!



- ఏసీబీ దాడులు, ఆ తర్వాత కేసుల మూసివేత
- ఏసీబీ దాడులు చేస్తోంది.. శిక్షలు పడుతున్నాయా?
- ప్రభుత్వ అనుమతుల దగ్గరే న్యాయానికి అడ్డంకులా?
- అధికారులకు ఒక నిబంధన.. సామాన్యులకు మరో న్యాయమా?

అవినీతికి అడ్డుకట్ట ఎక్కడ?

ప్రజాధనం దుర్వినియోగమైందన్న ఆరోపణలు వస్తే ఏసీబీ రంగంలోకి దిగుతుంది. లంచం తీసుకుంటూ పట్టుబడితే అరెస్టులు చేస్తుంది. అక్రమాస్తులపై సోదాలు నిర్వహించి ఆధారాలతో నివేదికలు సిద్ధం చేస్తుంది. కానీ అసలు పరీక్ష అక్కడే మొదలవుతోంది. ఏసీబీ పట్టుకున్న అవినీతి కేసులు చివరకు కోర్టు వరకు వెళ్తున్నాయా? నిందితులకు శిక్షలు పడుతున్నాయా? లేక ప్రభుత్వ అనుమతులు, శాఖాపరమైన విచారణల మధ్యే కేసులు కనుమరుగవుతున్నాయా? తెలంగాణలో 2023 నుంచి కనీసం 20 ఏసీబీ ఎఫ్ఐఆర్‌లు ప్రాసిక్యూషన్ అనుమతులు లభించక మూసివేత దిశగా వెళ్లినట్లు వెలుగులోకి వచ్చిన వివరాలు ఈ ప్రశ్నలను మరింత తీవ్రం చేస్తున్నాయి. లంచం తీసుకుంటూ పట్టుబడిన కేసులను సైతం క్రిమినల్ విచారణకు బదులుగా శాఖాపరమైన చర్యలకే పరిమితం చేస్తే అవినీతి నిరోధానికి ఎలాంటి ప్రయోజనం ఉంటుంది? అక్రమాస్తుల కేసులు ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉంటే ప్రజలకు న్యాయం ఎప్పుడు దక్కుతుంది? ఇక్కడ 20 కేసుల గణాంకం కంటే కీలకమైనది వ్యవస్థలోని జవాబుదారీతనం. ఏసీబీ దర్యాప్తు నుంచి ప్రభుత్వ అనుమతి వరకు, శాఖాపరమైన చర్యల నుంచి న్యాయస్థానాల తీర్పుల వరకు ప్రతి దశలో పారదర్శకత ఉండాలి. ఆరోపణలు ఎదుర్కొంటున్న వారికి చట్టపరమైన రక్షణలు కల్పిస్తూనే, ఆధారాలతో నేరం నిరూపితమైనప్పుడు శిక్ష పడేలా చూడాలి. ఏసీబీ పట్టుకోవడం మాత్రమే అవినీతి నిరోధం కాదు.. తప్పు చేసినవారికి శిక్ష పడినప్పుడే ఆ వ్యవస్థకు సార్థకత. లేదంటే అవినీతిని పట్టుకునే దర్యాప్తు ఒక వార్తగా, కేసుల మూసివేత మరో వార్తగా మిగిలిపోతుంది.

• ఏసీబీ పట్టుకుంటోంది.. కేసులు మాత్రం ఎందుకు ఆగుతున్నాయి?

తెలంగాణలో అవినీతి నిరోధక శాఖ ఒకవైపు లంచగొండి ఉద్యోగులను పట్టుకుంటూ, మరోవైపు అక్రమాస్తుల కేసుల్లో సోదాలు చేసి ఆధారాలు సేకరిస్తున్నా.. చివరకు క్రిమినల్ విచారణకు అనుమతుల దగ్గరే కేసులు నిలిచిపోతున్నాయనే విమర్శలు వస్తున్నాయి. 2023 నుంచి కనీసం 20 ఏసీబీ ఎఫ్ఐఆర్‌లు ప్రాసిక్యూషన్ అనుమతులు నిరాకరించడంతో కోర్టు ద్వారా మూసివేతకు వెళ్లగా, వాటిలో ఐదు ట్రాప్ కేసులు కూడా ఉన్నట్లు సమాచారం. మాజీ మహబూబ్‌నగర్ మున్సిపల్ కమిషనర్ వడ్డె సురేందర్ కేసు ఇందుకు ఉదాహరణ. 2020 అక్టోబర్ 22న క్లోరినేషన్ ప్లాంట్ పనులకు వర్క్ ఆర్డర్ ఇప్పించేందుకు రూ.1.65 లక్షలు తీసుకుంటుండగా ఏసీబీ ఆయనను పట్టుకుంది. దర్యాప్తు అనంతరం 202122లో ప్రాసిక్యూషన్‌కు అనుమతి కోరుతూ నివేదిక సమర్పించింది. అయితే ప్రభుత్వం 2025 ఫిబ్రవరి 27న క్రిమినల్ విచారణకు అనుమతి నిరాకరించి శాఖాపరమైన చర్యలకు ఆదేశించింది. డిసెంబర్ 12న అదే నిర్ణయాన్ని పునరుద్ఘాటించింది. దీంతో 2026 ఫిబ్రవరి 13న ఏసీబీ కేసు మూసివేతకు కోరగా, ఆగస్టు 14న ప్రత్యేక న్యాయస్థానం తుది నివేదికను అంగీకరించింది. ఇక్కడ ప్రశ్న ఏసీబీ దర్యాప్తు చేసిందా లేదా అన్నది కాదు.. దర్యాప్తులో ఆధారాలు సేకరించిన కేసులో క్రిమినల్ విచారణ ఎందుకు కొనసాగలేదు? అన్నదే.

• ప్రభుత్వ అనుమతి.. వ్యవస్థలో కీలకమైన మలుపు!

అవినీతి కేసులో ప్రభుత్వ ఉద్యోగిపై క్రిమినల్ ప్రాసిక్యూషన్ కొనసాగించేందుకు చట్టప్రకారం అవసరమైన సందర్భాల్లో సంబంధిత అధికార సంస్థ నుంచి అనుమతి తీసుకోవాలి. ఈ నిబంధన ఉద్దేశం విధి నిర్వహణలో నిజాయితీగా పనిచేసే అధికారులను నిరాధార కేసుల నుంచి రక్షించడం. అయితే అదే ప్రక్రియలో నిర్ణయం తీసుకోవడంలో అసాధారణ జాప్యం జరిగితే లేదా కారణాలు వెల్లడించకుండా అనుమతి నిరాకరిస్తే దర్యాప్తు వ్యవస్థ ప్రభావం తగ్గే ప్రమాదం ఉంటుంది. ఏసీబీ కేసుల విషయంలో ఇదే ప్రధాన చర్చగా మారింది. ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్ 2025 డిసెంబర్‌లో సమర్పించిన సమాచారంలో గత ఐదేళ్లలో 621 ఏసీబీ కేసులు నమోదయ్యాయని, ప్రాసిక్యూషన్ అనుమతి దాదాపు 25 శాతం కేసులకే లభిస్తోందని పేర్కొంది. 202324లో 19 కేసులు పరిష్కారమయ్యాయని, వాటిలో తొమ్మిది కేసుల్లో శిక్షలు, పది కేసుల్లో నిర్దోషిత్వ తీర్పులు వచ్చాయని తెలిపింది. 202425లో 22 కేసులు పరిష్కారం కాగా, 12 కేసుల్లో శిక్షలు, పది కేసుల్లో నిర్దోషిత్వ తీర్పులు నమోదయ్యాయని ఆర్టీఐ ఆధారంగా వెల్లడించింది. ఏటా సుమారు 20 నుంచి 25 కేసులే పరిష్కారమవుతున్నాయన్న ఆందోళన కూడా వ్యక్తమైంది. ఈ గణాంకాలు ఒక ముఖ్యమైన అంశాన్ని సూచిస్తున్నాయి. ఏసీబీ కేసు నమోదు చేయడం, నిందితుడిని పట్టుకోవడం మాత్రమే అవినీతి నిరోధక చర్యల విజయానికి కొలమానం కాదు. దర్యాప్తు పూర్తవడం, అనుమతులపై నిర్ణయం రావడం, ఛార్జిషీట్ దాఖలు కావడం, కోర్టులో విచారణ జరగడం, చివరకు తీర్పు వెలువడటం వరకు మొత్తం ప్రక్రియ వేగంగా సాగాలి. 2008లో నమోదైన భద్రు నాయక్ అక్రమాస్తుల కేసులో ప్రాసిక్యూషన్ అనుమతికి 16 నెలలు పట్టిందని, 2011లో ఛార్జిషీట్ దాఖలైనా పదిహేనేళ్లకు పైగా కేసు పెండింగ్‌లో ఉందని ఫోరం తన ఫిర్యాదులో ఉదహరించింది. ఈ వ్యవహారంలో నిందితుడైన అధికారి తిరిగి విధుల్లో చేరి, పదోన్నతి పొందిన తర్వాత మరోసారి లంచం తీసుకుంటూ పట్టుబడ్డారని కూడా పేర్కొంది. ఇవి ఫోరం సమర్పించిన ఆరోపణలు, వివరాలు. వాటిపై అధికారిక రికార్డులతో సమగ్ర పరిశీలన అవసరం.

లావకుమార్, టీజీఎస్పీడీసీఎల్ ఏడీఈ బి. చరణ్ సింగ్, మాజీ తహసీల్దార్ జి. సైదులు కేసులు కూడా ప్రభుత్వ అనుమతులు లభించకపోవడంతో 2025 జూలై నుంచి 2026 జనవరి మధ్య మూసివేతకు వెళ్లినట్లు ప్రచురిత వివరాలు వెల్లడిస్తున్నాయి. మరికొన్ని కేసులు శాఖాపరమైన విచారణకు మళ్లాయి. అక్రమాస్తుల కేసుల్లోనూ ఇలాంటి పరిణామాలున్నాయి. మాజీ హెచ్ఎండీఏ డైరెక్టర్ (ప్లానింగ్) కె. పురుషోత్తం రెడ్డిపై 2018లో ఏసీబీ కేసు నమోదు చేసి, కోట్ల విలువైన ఆస్తులు గుర్తించినట్లు వెల్లడించింది. అయితే 2025లో శాఖాపరమైన విచారణకు ప్రభుత్వం మొగ్గు చూపడంతో ఏసీబీ మూసివేత నివేదిక సమర్పించగా, నవంబర్ 11న ప్రత్యేక కోర్టు అంగీకరించింది. మాజీ జాయింట్ డైరెక్టర్ కె. పద్మ, ఏసీపీ వై. నరసింహారెడ్డి, డిప్యూటీ ఈఈ బి. సుదర్శన్ రెడ్డి తదితరుల కేసుల్లోనూ ఇలాంటి పరిణామాలు చోటుచేసుకున్నట్లు నివేదికలు పేర్కొంటున్నాయి. అయితే ప్రతి కేసులో ఆరోపణలు, ఆధారాలు ఒకేలా ఉండవు. క్రిమినల్ కేసుకు ఆధారాలు సరిపోకపోవచ్చు.. శాఖాపరమైన చర్యలు అవసరమని ప్రభుత్వం భావించవచ్చు. కానీ ఏసీబీ ఆధారాలను ఎందుకు అంగీకరించలేదు? కేసు మూసివేతకు ఏ కారణాలు చూపారు? నిర్ణయం ఎవరు తీసుకున్నారు? అన్నది పారదర్శకంగా వెల్లడించాలి. కేసు మూసివేత అంటే ఆరోపణలు అబద్ధమని తేలినట్లా? శాఖాపరమైన చర్య అంటే క్రిమినల్ బాధ్యత నుంచి విముక్తి లభించినట్లా? ఈ ప్రశ్నలకు ప్రభుత్వం స్పష్టమైన సమాధానం చెప్పాలి.

• ట్రాప్ నుంచి అక్రమాస్తుల వరకు.. కేసుల మూసివేతలెందుకు?

ఈ సమస్య ఒక్క వడ్డె సురేందర్ కేసుతోనే ఆగడం లేదు. లైన్ ఇన్‌స్పెక్టర్ జి. ప్రభాకర్ రావు, జూనియర్ లైన్‌మన్ ఎం. సతీష్ కుమార్, మాజీ ఎస్ఐ ఎన్.

• ఆస్తుల ప్రకటనలే అవినీతికి ముందస్తు నిరోధకమా?

అవినీతి జరిగిన తర్వాత ఏసీబీ దాడులు చేయడం కంటే, అక్రమ సంపాదనకు ముందుగానే అడ్డుకట్ట వేయడం ముఖ్యం. తెలంగాణ ప్రభుత్వ ఉద్యోగులు వార్షిక ఆస్తుల వివరాలు సమర్పించాలనే నిబంధనలు ఉన్నప్పటికీ వాటి అమలుపై పర్యవేక్షణ అవసరం. తెలంగాణ సివిల్ సర్వీసెస్ (కండక్ట్) రూల్స్-1964లోని రూల్ 9(7), సివిల్ సర్వీసెస్ (సీసీఏ) రూల్స్-1991లోని రూల్ 20 అమలుపై ఆర్టీఐ కన్సల్టెంట్, సామాజిక కార్యకర్త 2025 ఏప్రిల్ 28న ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి ఫిర్యాదు చేశారు. ఆస్తుల వివరాలను వెబ్ సైట్లలో ప్రచురించాలని, సమర్పించని ఉద్యోగులపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. స్పందన లేకపోవడంతో 2026 మే 23, జూన్ 4 తేదీల్లో మరోసారి లేఖలు పంపారు. తన ఫిర్యాదులో ఏసీబీ వెల్లడించిన రెండు కేసులను ఉదహరించారు. 2025 ఏప్రిల్ 26న వెల్లడించిన ఇరిగేషన్ శాఖ ఇంజినీర్ఇన్‌చీఫ్ భూక్య హరిరామ్ కేసులో సుమారు రూ.100 కోట్ల విలువైన ఆస్తులు, 2026 మే 22న వెల్లడించిన మాజీ స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ మర్రి వంశీ మోహన్ కేసులో రూ.6.22 కోట్లకు పైగా ఆస్తులు గుర్తించినట్లు పేర్కొన్నారు. ఇవి ఏసీబీ వెల్లడించిన దర్యాప్తు వివరాలే తప్ప తుది నేర నిర్ధారణలు కావు. అయినప్పటికీ ఉద్యోగుల ఆస్తుల ప్రకటనలను క్రమం తప్పకుండా పరిశీలిస్తే అక్రమ సంపాదనపై ముందుగానే నిఘా పెట్టవచ్చు. ఆస్తులు కూడబెట్టిన తర్వాత దాడులు చేయడం కాదు.. ఆదాయానికి మించిన ఆస్తులు పెరగకుండా ముందస్తు పర్యవేక్షణ చేయడమే అవినీతి నిరోధానికి అసలైన మార్గం.





• తప్పకు శిక్ష లేకపోతే.. అవినీతికి భయమెక్కడ?

అవినీతిని అరికట్టాలంటే చట్టాలు ఉండటమే కాదు.. తప్పు చేసినవారికి శిక్ష పడుతుందనే నమ్మకం కలగాలి. ఏసీబీ కేసు నమోదైన తర్వాత ప్రాసిక్యూషన్ అనుమతుల కోసం ఏళ్ల తరబడి ఎదురుచూడటం, శాఖాపరమైన విచారణలు నత్తనడకన సాగడం, కోర్టు తీర్పులకు దశాబ్దాలు పట్టడం వ్యవస్థపై విశ్వాసాన్ని దెబ్బతీస్తున్నాయి. ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్ 2025 డిసెంబర్ 19న ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, విజిలెన్స్ కమిషనర్, ఏసీబీ డీజీకి సమర్పించిన ఫిర్యాదులో గత ఐదేళ్లలో నమోదైన 621 కేసుల్లో విచారణ, ప్రాసిక్యూషన్ అనుమతులు, శాఖాపరమైన చర్యల్లో జాప్యాన్ని ప్రస్తావించింది. ఏసీబీ సమాచార ప్రకారం ట్రాప్ కేసులకు 6 నెలలు, అక్రమాస్తుల కేసులకు 6 నెలలు, డిస్క్రీట్ విచారణలకు 2 నెలలు, సాధారణ విచారణలకు 4 నెలలు, సర్‌ప్లైజ్ తనిఖీలకు నెల రోజులు గడువు ఉన్నప్పటికీ ఆచరణలో జాప్యం కొనసాగుతోందని ఆందోళన వ్యక్తం చేసింది. ప్రభుత్వ అనుమతులకు నిర్దిష్ట గడువు విధించాలి. శాఖాపరమైన విచారణలను సకాలంలో పూర్తి చేయాలి. కేసుల మూసివేతకు కారణాలు వెల్లడించాలి.





• అవినీతిపై మౌనం కూడా నేరమే.. వ్యవస్థలు మేల్కొనాలి!

జనగామలో జిల్లా కోర్టు భవన సముదాయానికి శంకుస్థాపన సందర్భంగా హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బి. విజయసేనరెడ్డి చేసిన అన్యాయాన్ని ప్రశ్నించకపోవడాన్ని కూడా నేరంగానే పరిగణించాలి అన్న వ్యాఖ్యలు ప్రస్తుత పరిస్థితులకు అద్దం పడుతున్నాయి. కోర్టులు న్యాయ దేవాలయాలుగా పనిచేయాలని, న్యాయవాదులు అంకితభావంతో విధులు నిర్వహించాలని ఆయన సూచించారు. ఇదే స్ఫూర్తి అవినీతి నిరోధక వ్యవస్థలోనూ కనిపించాలి. ఏసీబీ దర్యాప్తు, ప్రభుత్వ ప్రాసిక్యూషన్ అనుమతులు, న్యాయస్థానాల విచారణ మధ్య సమన్వయం లేకపోతే బాధితులుగా మిగిలేది ప్రజలే. తెలంగాణలో 2023 నుంచి మూసివేసిన 20 ఏసీబీ కేసుల వివరాలు, వాటి మూసివేతకు గల కారణాలు, ప్రాసిక్యూషన్ అనుమతుల నిరాకరణకు సంబంధించిన నిర్ణయాలను ప్రభుత్వం వెల్లడించాలి. పెండింగ్ కేసులపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నేతృత్వంలో ఏసీబీ, విజిలెన్స్, సంబంధిత శాఖలతో ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించి గడువులు నిర్ణయించాలి. ఆస్తుల వార్షిక ప్రకటనలు సమర్పించని ఉద్యోగుల వివరాలు సేకరించి, శాఖలవారీగా అమలును పర్యవేక్షించాలి. ఏసీబీకి సిబ్బంది, సాంకేతిక నిపుణులు, ఆర్థిక లావాదేవీల విశ్లేషణ సామర్థ్యాన్ని పెంచాలి. దర్యాప్తు నుంచి తీర్పు వరకు జవాబుదారీతనం ఉండాలి. ఏ పార్టీ అధికారంలో ఉన్నా, ఏ స్థాయి ఉద్యోగి అయినా చట్టం సమానంగా అమలవుతుందనే నమ్మకం ప్రజల్లో కలగాలి. ఏసీబీ దాడులు వార్తలుగా మారి, కేసుల మూసివేతలు చర్చలుగా మిగిలితే అవినీతి నిరోధానికి అర్థమే ఉండదు. అవినీతిపరులకు శిక్ష, నిర్దోషులకు న్యాయం, ప్రభుత్వ నిర్ణయాలకు పారదర్శకతే నిజమైన పాలనకు పునాది.

- గంజి శ్రీనివాసరావు,



ప్రజాస్వామ్యం ఖూనీ.. జగన్ నిరసన ధ్వని

ఎలక్షన్ బాయ్ కాట్.. జగన్ వాకౌట్

నడి రోడ్డుపై అజిటేషన్

ఓటింగ్ అక్రమాలపై ఎలిగేషన్

- ఓటేయకుండానే వెనుదిరిగిన జగన్!
- నడిరోడ్డుపై నిరసన.. ఏజెంట్ల ఫారాల చించివేత ఆరోపణలు
- పులివెందులలో రాజకీయ చరిత్రలో ఎరుగని ఎన్నికల అనుభవం!
- వైఎస్ ప్రమీలమ్మ వాహనంపై దాడి.. కాన్వాయ్‌కు దస్తగిరి అడ్డంకి..!
- 150 మందితో జగన్‌కు భద్రత.. రీపోలింగ్ డిమాండ్‌తో దేశవ్యాప్త చర్చ!

పులివెందుల అంటే ఒక సాధారణ మున్సిపాలిటీ కాదు. నాలుగు దశాబ్దాలుగా వైఎస్ కుటుంబ రాజకీయ ప్రస్థానంతో విడదీయలేని అనుబంధం ఉన్న ప్రాంతం. వైఎస్ రాజశేఖరరెడ్డి రాజకీయ ఎదుగుదలకు పునాది వేసిన గడ్డ. జగన్ రాజకీయ ప్రస్థానానికి ప్రత్యేక గుర్తింపు తెచ్చిన ప్రాంతం. అలాంటి చోట మున్సిపల్ ఎన్నికలు ఇంతటి ఉద్రిక్తతకు, వివాదాలకు కేంద్రంగా మారడం రాష్ట్ర రాజకీయాల్లో చర్చనీయాంశమైంది. సాధారణంగా ఎన్నికలంటే ప్రచార హోరు, అభ్యర్థుల పోటీ, ఓటర్ల తీర్పు. కానీ పులివెందులలో ఈసారి కనిపించిన దృశ్యాలు మాత్రం అందుకు భిన్నంగా ఉన్నాయి. పోలింగ్‌కు ముందే వాహనాల దహనాలు, అభ్యర్థులపై దాడుల ఆరోపణలు, పోలింగ్ ఏజెంట్లను అడ్డుకున్నారన్న ఫిర్యాదులు, ఏజెంట్ ఫారాలను చించివేశారన్న వివాదాలు, మీడియా ప్రతినిధులపై దాడుల ఆరోపణలు.. ఒక్కొక్కటిగా తెరపైకి వచ్చాయి. వైసీపీ చైర్‌పర్సన్ అభ్యర్థి వైఎస్ ప్రమీలమ్మ వాహనంపై దాడి జరిగిందన్న వార్తలు మరింత కలకలం రేపాయి. మాజీ ముఖ్యమంత్రి జగన్ కాన్వాయ్ మార్గంలో వివేకానందరెడ్డి హత్య కేసు అప్రూవర్ షేక్ దస్తగిరి ప్రత్యక్షం కావడం మరో అనూహ్య పరిణామం. పరిస్థితులు ఉద్రిక్తంగా మారడంతో జగన్ స్వయంగా ఆర్వో కార్యాలయం ఎదుట నడిరోడ్డుపై బైఠాయించి నిరసనకు దిగారు. మొత్తం 80 పోలింగ్ కేంద్రాల్లో రీపోలింగ్ నిర్వహించాలని డిమాండ్ చేశారు. చివరకు ఓటు వేయకుండానే బెంగళూరుకు తిరుగు ప్రయాణమయ్యారు. నాలుగు దశాబ్దాల రాజకీయ అనుబంధం ఉన్న ప్రాంతంలో వైఎస్ కుటుంబానికి చెందిన మాజీ ముఖ్యమంత్రి ఓటు వేయకుండా వెళ్లిపోవడం రాజకీయంగా అసాధారణ పరిణామంగా మారింది. ఈ ఘటనతో పులివెందుల ఎన్నికలు జిల్లా రాజకీయాల పరిధిని దాటి రాష్ట్రవ్యాప్తంగా చర్చకు వచ్చాయి. అయితే ఈ పరిణామాలను కేవలం వైసీపీ, టీడీపీ మధ్య ఆధిపత్య పోరుగా చూడలేం. ఎన్నికల నిర్వహణలో పారదర్శకత ఉందా? అభ్యర్థులకు సమాన అవకాశాలు కల్పించారా? పోలింగ్ ఏజెంట్ల హక్కులు కాపాడారా? సాధారణ ఓటరు భయపడకుండా ఓటు వేసే వాతావరణం ఉందా? అనే కీలక ప్రశ్నలు ముందుకొచ్చాయి. రాజకీయ పార్టీల వాదనలకు అతీతంగా ఈ ప్రశ్నలకు ఆధారాలతో సమాధానాలు రావాల్సిన అవసరం ఏర్పడింది.



• ఓటు వేయకుండానే బెంగళూరుకు పయనం.. ఎస్ఈసీదే అసలు పరీక్ష!

